జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php



చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
న్యూస్ ఈజ్ రైట్
6-2-29/3/12, 3వ అంతస్థు, దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523



సంపుటి 15 సంచిక 127 విశాఖపట్నం | శనివారం 22 జనవరి 2022 | 8 పేజీలు | వెల : 5.00




# త్వరలో మోగనున్న ఎన్నికల నగారా..!

విజయవాడ, జనవరి 21, :గతంలో ఎన్నికలు జరగని 22 నగరపాలక సంస్థలు, మునిసిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఈవీఎంల విధానంలో ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ కసరత్తు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 17 నగరపాలక సంస్థలు, 106 మునిసిపాలిటీలు, నగర పంచాయతీలున్నాయి. తెలుగుదేశం ప్రభుత్వంలో కాకినాడ కార్పొ రేషన్ ఎన్నికలు జరిగాయి. వైఎస్సార్‌సీపీ అధికా రంలోకి వచ్చిన తరువాత గత ఏడాది మార్చిలో 12 నగరపాలక సంస్థలు, 75 పురపాలక సంఘాలకు, నవంబర్‌లో నెల్లూరు నగరపాలక సంస్థకు, 12 పుర పాలక సంఘాలు, నగర పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించింది. ఈ రెండు విడతల్లోను బ్యాలెట్ విధానంలోనే ఎన్నికలు జరిగాయి. కోర్టు కేసుల కారణంగా రాజమహేంద్రవరం (రాజమండ్రి), శ్రీకా కుళం, మంగళగిరి?తాడేపల్లి నగరపాలక సంస్థల్లో ను, ఆముదాలవలస, రాజాం (శ్రీకాకుళం జిల్లా), తణుకు, పాలకొల్లు, భీమవరం, తాడేపల్లిగూడెం, చింతలపూడి (పశ్చిమగోదావరి), వైఎస్సార్ తాడిగడప, గుడివాడ (కృష్ణా), బాపట్ల, పొన్నూరు, నర నరావుపేట (గుంటూరు), కందుకూరు, పొదిలి (ప్రకాశం), కావలి, గూడూరు, అల్లూరు (నెల్లూరు), బి.కొత్తకోట, శ్రీకాళహస్తి (చిత్తూరు జిల్లా) పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో ఎన్నికలు జరగలేదు. కోర్టు కేసులు కొలిక్కి వస్తే వీలైనంత త్వరగా వీటికి ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ సన్నాహాలు చేస్తోంది.రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని వారం రోజుల కిందట తన కార్యాలయ అధికారులతో సమావేశం నిర్వహించి ఈవీఎంల విధానంలో ఎన్నికల నిర్వహణ సాధ్యాసాధ్యాలపై చర్చించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మునిసిపల్ ఎన్నికలు ఈవీఎంల విధానంలో నిర్వహించిన విషయాన్ని అధికారులు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. దాదాపు 8 వేల ఈవీఎంలు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. 22 నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చినా నాలుగువేల బూత్‌లలోనే పోలింగ్ ఉంటుందని, ఇందుకు ఆ ఈవీఎంలు సరిపోతాయని వివరించారు. అసెంబ్లీ, లోకసభ ఎన్నికలను ఈవీఎంలతో పాటు వీవీప్యాట్‌లతో కలిపి ఉండే మిషన్లతో నిర్వహిస్తున్నారని, రాష్ట్ర ఎన్నికల కమిషన్ వద్ద వీవీప్యాట్‌లు లేని పాత ఈవీఎంలు (మిగతా 2లో..)

# పీఆర్సీ సహా పలు కీలక అంశాలకు కేబినెట్ ఆమోదం



అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో శుక్రవారం ఉదయం ప్రారంభమైన రాష్ట్ర మంత్రివర్గం సమావేశం అయింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. పీఆర్సీ సహా పలు కీలక అంశాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఉద్యోగులు రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచుతూ తీసుకున్న నిర్ణయానికి కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఉద్యోగులకు జగనన్న టౌన్‌షిప్ లలో ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రతిపాదనకు ఆమోదం తెలిపిన కేబినెట్.. టౌన్‌షిప్‌లలో 10 శాతం ప్లాట్లు 20 శాతం రిబెట్ తో ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. కేబినెట్ భేటీ ముగిసిన తర్వాత మంత్రి పేర్ని నాని మీడియాతో మాట్లాడి అందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. రైతుల నుండి ధాన్యం కొనుగోళ్ల కోసం రూ. 5 వేల కోట్లు కేటాయించినట్లు చెప్పిన మంత్రి.. ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లో రైతుకు నగదు చెల్లింపు ఉంటుందన్నారు.

**క్యాబినెట్ నిర్ణయాలు**

ఈబీసీ నేస్తం అమలుకు క్యాబినెట్ ఆమోదం

ఈనెల 25న ఈబీసీ నేస్తం పథకానికి సీఎం జగన్ శ్రీకారం

16 వైద్య కళాశాలల నిర్మాణానికి కేబినెట్ ఆమోదం

ఇప్పటికే ఉన్న 11 వైద్య కళాశాలల అభివృద్ధికి కేబినెట్ ఆమోదం

వైద్య కళాశాలలకు రూ, 7,880 కోట్లు ఖర్చు చేసేందుకు ఆమోదం

ప్రస్తుత వైద్య కళాశాలల అభివృద్ధికి రూ. 3,820 కోట్లు కేటాయింపు

గ్రామీణ ప్రాంతాల్లో వాయిదాల్లో ఓటీఎస్ చెల్లింపునకు ఆమోదం

రైతుల నుండి ధాన్యం కొనుగోళ్ల కోసం రూ. 5 వేల కోట్లు

(మిగతా 2లో..)

# సంకుచిత భావాల నుంచి దేశాన్ని బయటికి తెస్తున్నాం: మోదీ



అహ్మదాబాద్ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం కాంగ్రెస్‌పై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. స్వాతంత్ర్యానంతరం నూతన నిర్మాణాలు కేవలం ఢిల్లీలోని కొన్ని కుటుంబాల కోసం మాత్రమే జరిగాయని, తన ప్రభుత్వం ఈ సంకుచిత ఆలోచనా ధోరణి నుంచి దేశాన్ని బయటకు తీసుకొచ్చిందని చెప్పారు. జాతీయ ప్రాధాన్యంగల నూతన నిర్మాణాలను తన ప్రభుత్వం చేపట్టిందన్నారు. గుజరాత్‌లోని గిర్ సోమనాథ్ జిల్లాలో సుప్రసిద్ధ సోమనాథ దేవాలయం వద్ద కొత్తగా నిర్మించిన సర్క్యూట్ హౌస్‌ను వర్చువల్ విధానంలో ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. మన మతపరమైన, సాంస్కృతికపరమైన వారసత్వం గురించి మాట్లాడాలంటే గతంలో సందేహం ఉండేదన్నారు. మన పూర్వీకులు మనకు అనేక విషయాలను అందజేశారన్నారు. అయితే మన సుసంపన్నమైన మత, సాంస్కృతిక వారసత్వం గురించి మాట్లాడాలంటే సందేహం ఉండేదన్నారు. స్వాతంత్ర్యానంతరం కేవలం ఢిల్లీలోని కొన్ని కుటుంబాల కోసం మాత్రమే నూతన నిర్మాణాలు జరిగాయన్నారు. తాము ఈ సంకుచిత భావం నుంచి దేశాన్ని బయటకు తీసుకొచ్చామన్నారు. జాతీయ ప్రాధాన్యంగల నూతన కట్టడాలను నిర్మిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఉన్నవాటికి మెరుగులు దిద్దుతున్నామని చెప్పారు. పర్యాటక రంగం అభివృద్ధి చెందాలంటే పరిశుభ్రత, సదుపాయాలు, పర్యాటకుల సమయం పట్ల గౌరవభావం, ఆధునిక దృక్పథం ఉండాలన్నారు. మతపరమైన, వారసత్వ ప్రాధాన్యంగల ప్రదేశాలను అభివృద్ధి చేయడం వల్ల ఆ ప్రాంతాల్లో ఆర్థికాభివృద్ధి జరుగుతుందన్నారు. ఇదిలావుండగా, సోమనాథ్ దేవాలయం ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా మోదీ వ్యవహరిస్తున్నారు.

# వచ్చే ఆదివారం పూర్తి లాక్‌డౌన్ ..!: స్టాలిన్



చెన్నై: కోవిడ్ కేసులు అంతకంతకూ పెరుగుతుండటంపై తమిళనాడు ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈనెల 23వ తేదీ ఆదివారంనాడు రాష్ట్రవ్యాప్తంగా పూర్తి లాక్‌డౌన్‌ను ప్రకటించింది. పెరుగుతున్న కోవిడ్ కేసుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుక్రవారంనాడు ప్రకటించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, విమానాశ్రయాలకు, బస్, రైల్వేస్టేషన్లకు ప్రయాణికులను తీసుకువెళ్లే ఆటోలు, టాక్సీలను మాత్రం అనుమతిస్తారు. తమిళనాడులో గురువారం ఒక్కరోజు 28,561 కొత్త కోవిడ్ కేసులు నమోదయ్యాయి. దీంతో రాష్ట్రంలో నమోదైన మొత్తం కేసుల సంఖ్య 30,43,796కు చేరింది.

# ఉద్యోగసంఘాల భేటీలో కీలక నిర్ణయాలు



అమరావతి: పీఆర్సీపై ఏకపక్ష జీవోలు జారీ చేసిన సర్కారుపై 'సమ్మె అస్త్రం' ప్రయోగించేందుకు ఉద్యోగ సంఘాలు సిద్ధమవుతున్నాయి. వేర్వేరు సంఘాలన్నీ ఉమ్మడిగా కలిసి వచ్చి... ఉద్యమించాలని నిర్ణయించుకున్నాయి. పీఆర్సీపై ఎవరికి వారుగా కాకుండా... సంఘాలన్నీ ఉమ్మడిగా ఉద్యమించాలని పలు ఉద్యోగ సంఘాలు ప్రతిపాదించాయి. ఈ నేపథ్యంలోనే ఉద్యోగసంఘాలు భేటీ అయ్యాయి. ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఫిబ్రవరి 7 నుంచి ఉద్యోగుల నిరవధిక సమ్మె చేయాలని నిర్ణయం తీసుకున్నారు. సోమవారం ఉద్యోగ సంఘాలు సమ్మె నోటీసులు ఇవ్వనున్నాయి. ఉద్యోగసంఘాల భేటీలో కీలక నిర్ణయాలుఈ నెల 23న జిల్లా కేంద్రాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలుఈ నెల 25న జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, ధర్నాలు ఈ నెల 26న అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాల సమర్పణఈ నెల 27 నుంచి 30 వరకు ఉద్యోగుల నిరాహార దీక్షలుఫిబ్రవరి 3న చలో విజయవాడఫిబ్రవరి 5 నుంచి సహాయ నిరాకరణ






# బీజేపీ, జనసేనకు షాకేనా ?



అమరావతి : తాజాగా వెల్లడైన సర్వే రిపోర్టు ప్రకారమైతే మిత్రపక్షాలకు షాక్ తప్పేలా లేదు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే అనే పేరుతో సీ ఓటర్-ఇండియా టు డే సంస్థలు మూడ్ ఆఫ్ ది నేషన్ కనుక్కునేందుకు సర్వే చేశాయి. ఈ సర్వేలో మిత్రపక్షాలకు గట్టి షాక్ తప్పదని తేలిపోయింది. జనాలు అసలు బీజేపీ జనసేన పార్టీలను పెద్దగా పట్టించుకుంటున్నట్లు లేదు. ఎందుకంటే ప్రజాదరణ జగన్మోహన్ రెడ్డికి తగ్గలేదని తాజా సర్వే చెబుతోంది.ఓటీఎస్ వ్యతిరేకత విశాఖ ఉక్కు ఉద్యమం పోలవరం అమరావతి ఉద్యోగుల జీతాలు కాంట్రాక్టు ఉద్యోగుల గోడు మందుబాబుల తిప్పలు ఇసుక కష్టాలు నిర్మాణ కూలీలు రోడ్డున పడటం ఇవన్నీ ఈ స్థాయిలో ఏపీలో కనిపిస్తుంటే మరి ఈ సర్వేలో జగనే గెలుస్తాడని చెప్పడం కాస్త ఆశ్చర్యమే.సర్వే చెప్పినదాని ప్రరకారం ఎంపీ సీట్లయినా అసెంబ్లీ సీట్లయినా వైసీపీ ఖాతాలోనే పడతాయని తేలింది. అయితే వైసీపీకి ఎన్నిసీట్లు వస్తాయనే విషయంపై క్లారిటీ లేదు. ఏదేమైనా మళ్ళీ అధికారం మాత్రం జగన్ దే అని సర్వేలో తేలింది. ఇదే సమయంలో మిత్రపక్షాలకు లోక్ సభ లో ఒక్క సీటు కూడా రాదని తేలిందట. రాబోయే ఎన్నికల్లో అధికారం మనదే అంటు బీజేపీ చీఫ్ సోము వీర్రాజు జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎప్పుడు సమావేశాలు పెట్టినా ఒకటే ఊదరగొడుతున్నారు.అధికారం తమదే అని చెబుతున్నదే వాస్తవమైతే మరి లోక్ సభ సీట్లు కూడా గెలుచుకోవాలి. ఎందుకంటే మెజారిటీ అసెంబ్లీ సీట్లు గెలవనిదే లోక్ సభ సీట్లు గెలవడం సాధ్యం కాదు. తాజా సర్వేలో మిత్రపక్షాలకు ఒక్క పార్లమెంటు సీటు కూడా రాదని తేలిందంటే అసెంబ్లీ సీట్లలో గెలుపుపైన కూడా అనుమానం వస్తోంది. కాబట్టి అధికారం అందుకునే విషయంలో వాళ్ళద్దరిదీ కేవలం భ్రమలు మాత్రమే అర్థమవుతోంది.క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్దితులు ఏమిటనేది వాళ్ళకు కూడా తెలిసే ఉంటుంది. కాకపోతే నేతలను శ్రేణుల్లో ఉత్సాహం నింపేందుకు పార్టీల అధినేతలు అందరూ చెప్పే మాటలనే వీర్రాజు పవన్ కూడా చెబుతున్నారంతే. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే జగన్మోహన్ రెడ్డే తిరిగి అధికారంలోకి వస్తారని సర్వేలో తేలింది.అయితే ఈ సర్వే శాంపిల్ సైజ్ తక్కువ. (మిగతా 2లో..)

# ఉద్యోగాల్లో వృద్ధి రేటు

ముంబై, జనవరి 21, :కరోనా ఒక వైపు వీరవిహారం చేస్తున్నా ఉద్యోగ నియామకాల్లో మంచి వృద్ధిరేటు కనబడుతోంది. 2021 ద్వితీయార్థంలో అంటే జూలై నుంచి డిసెంబర్ వరకూ జరిగిన నియామకాల్లో మంచి వృద్ధిరేటు కనిపించింది. గత ఏడాది ప్రథమార్థంలో అంటే జనవరి నుంచి జూన్ వరకూ జరిగిన నియామకాలతో పోలిస్తే వృద్ధిరేటులో పురోగతి కనిపించింది. ఇండీడ్ సంస్థ విడుదల చేసిన నివేదికలో కీలక విషయాలు వెల్లడయ్యాయి. 2021 ప్రథమార్థంలో ఉద్యోగాల కల్పన 44 శాతం జరిగితే ద్వితీయార్థంలో మాత్రం అది 53 శాతానికి పెరిగింది. ఎంట్రీ లెవల్ 81 శాతం. జూనియర్ లెవల్ క్యాండిడేట్స్ 66 శాతం జరగగా, ప్రథమార్థంలో మాత్రం ఎంట్రీ లెవల్ 69 శాతం, జూనియల్ లెవల్ ఉద్యోగాల భర్తీ 57శాతంగా నమోదైంది. కరోనా కారణంగా తమ ఉద్యోగ ప్రాధాన్యతలను, లక్ష్యాలను పునర్ నిర్వచించుకున్నారని ఇండీడ్ తెలిపింది. 79 శాతం మంది ఉద్యోగుల ఆలోచనా సరళిలో మార్పులు వచ్చాయని సర్వేలో తేలింది. డిఫరెంట్ కెరీర్ ఆలోచనలో వారు వున్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న వారిలో 31 శాతం అబ్బాయిలు, 19 శాతం అమ్మాయిలు తమ ఆలోచనల్ని మార్చుకుని కొత్త ఉద్యోగాల వైపు మొగ్గుచూపారు. ప్రతి పది మందిలో ముగ్గురి కెరీర్ ఆలోచనలు విప్లవాత్మకంగా మారాయని అంటున్నారు. 51 శాతం మంది తమ ప్రస్తుత ఉద్యోగం ఒక ఉద్దేశ్యాన్ని నెరవేరుస్తుందా అని ఆలోచించారు67శాతం మంది తాము సరైన ఉద్యోగంలో ఉన్నామా అని తమని తాము ప్రశ్నించుకున్నారు61శాతం మంది జీవిత ప్రాధాన్యతలకు అనుకూలంగా తమ ఉద్యోగంలో మంచి మార్పు గురించి ఆలోచించారు తాము చేస్తున్న ఉద్యోగంలో 68శాతం ? ఉద్యోగ సంతృప్తి, 62శాతం మంది- జీతం. 61శాతం ? జీవితం-ఉద్యోగం సమతుల్యం గురించి ఆలోచించారు. అలాగే 49శాతం మంది 5 రోజుల పనిదినాలపై దృష్టి పెట్టారు.

51శాతం మంది రోజుకి 6-8 గంటలకు ప్రాధాన్యత ఇచ్చారు. 2021 ద్వితీయార్థంలో సేల్స్ రంగంలో అత్యధికంగా రిక్రూట్ మెంట్లు జరిగాయి. సేల్స్ లో 73శాతం, టెక్నాలజీలో 61 శాతం, మార్కెటింగ్ రంగంలో 59శాతం రిక్రూట్ మెంట్లు జరిగాయి. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో 69 శాతం, ఈ కామర్స్, స్టార్టప్‌లో 65శాతం, టెలికాంలో 47శాతం ఉద్యోగాలు లభించాయి.

# అయోధ్య నుంచి యోగీ..

లక్నో, జనవరి 21,:యూపీలో రాజకీయ వేడి రాజుకుంది. త్వరలో జరగబోయే ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది బీజేపీ. మళ్ళీ అధికారమే పరమావధిగా అడుగులు వేస్తోంది. సీఎం యోగి ఆదిత్యనాథ్ అయోధ్య నుంచి పోటీచేయనున్నారా..? ఇంతకూ యోగీని అయోధ్యనుంచే పోటీకి దించాలని బీజేపీ నేతలు ఎందుకు భావిస్తున్నారు?? యోగీ, అయోధ్య స్థానానికి మారడం.. సార్వత్రిక ఎన్నికలపై ఎలాంటి ప్రభావం చూపనుంది.?అనేది యావత్ భారతాన చర్చనీయాంశంగా మారింది.యుూపీ సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి సత్తా చాటేందుకు బీజేపీ అన్ని వ్యూహాల్ని పరిశీలిస్తోంది. ముఖ్యంగా సీఎం యోగీ ఆదిత్యనాథ్.. అయోధ్య నుంచి పోటీ చేసే అవకాశం కనిపిస్తోంది. ఈ విషయాన్ని త్వరలోనే పార్టీ ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. యోగి అయోధ్య అసెంబ్లీ స్థానంలో పోటీకి దిగితే, అది పార్టీకి పూర్తి సానుకూలంగా పరిణమిస్తుందని నేతలు భావిస్తున్నారు. యోగి ఆదిత్యనాథ్‌ను అయోధ్య బరిలో నిలపాలన్న బీజేపీ వ్యూహం వెనుక ఐదు కారణాలు ఉన్నట్లు విశ్లేషకులు చెప్తున్నారు. రామాలయ నిర్మాణం, యోగీపై హిందుత్వ నేతగా ముద్ర, అవధ్‌పై ప్రభావం, ఓటర్లకు స్పష్టమైన సందేశం, అయోధ్య బీజేపీకి అత్యంత ముఖ్యమైనదన్న సంకేతాన్ని జనంలోకి పంపించడంగా తెలుస్తోంది.దాదాపు 500 ఏళ్ళనాటి సమస్యకు సుప్రీంకోర్టు తీర్పుతో పరిష్కారం లభించింది. తర్వాత రామాలయ నిర్మాణం వేగంగా జరుగుతోంది. దీంతో రాజకీయంగా బీజేపీకి సానుకూలత కనిపిస్తోంది. సంఘ్ పరివార్‌కు ఇది కేంద్ర స్థానం కావడం కూడా మరొక కారణం. యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని గోరఖ్‌నాథ్ పీఠానికి, అయోధ్యకు అవినాభావ సంబంధం ఉంది. యోగి ఆదిత్యనాథ్ గురువులు మహంత్ అవైద్యనాథ్, మహంత్ దిగ్విజయనాథ్ తమ తమ కాలాల్లో రామాలయం ఉద్యమానికి నాయకత్వం వహించారు. 1949లో రామ జన్మభూమి ఉద్యమంలో మహంత్ దిగ్విజయనాథ్ ప్రముఖ పాత్ర పోషించారు.యోగి ఆదిత్యనాథ్‌ను అయోధ్య నుంచి పోటీ చేయించడం వల్ల బీజేపీ హిందుత్వ భావజాలం మరింత బలోపేతమవుతుంది. ఫలితంగా బీజేపీ హిందుత్వ నేతగా ఆయనకు మరింత ఎక్కువ గుర్తింపు లభిస్తుందని భావిస్తోంది. ఉత్తర ప్రదేశ్‌లోని అవధ్ ప్రాంతంలో అయోధ్య ఉంది. ఈ ప్రాంతంలో సమాజ్‌వాదీ పార్టీకి మంచి పట్టు ఉంది. అయోధ్య నుంచి యోగి పోటీ చేస్తే ఈ ప్రాంతంలోని అన్ని నియోజకవర్గాలపై ప్రభావం పడుతుంది. దీనివల్ల పార్టీ లాభపడుతుందని బీజేపీ భావిస్తోంది.ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పవిత్ర పుణ్య క్షేత్రం వారణాసి నుంచి పోటీ చేసి, గొప్ప అనుబంధాన్ని ప్రదర్శిస్తున్నారు. అదేవిధంగా యోగి కూడా అయోధ్య నుంచి పోటీ చేస్తే, ఆ నియోజకవర్గంతో ప్రత్యేక అనుబంధాన్ని చాటవచ్చు. అయోధ్య నియోజకవర్గం బీజేపీకి చాలా ముఖ్యమైన స్థానం. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అయోధ్యపై



యోగి ప్రత్యేక దృష్టి సారించారు. మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేశారు. రోడ్ల విస్తరణ, స్నాన ఘట్టాల సుందరీకరణ వంటి కార్యక్రమాలను నిర్వహించారు. అయోధ్యను ఎంచుకోవడం వెనుక పక్కా వ్యూహం వుందంటున్నారు విశ్లేషకులు.

## కేరళను కమ్మేస్తున్న ఒమిక్రాన్

తిరువనంతపురం, జనవరి 21, :వేరియంట్ వ్యాప్తితో దేశంలో కరోనా వైరస్ కేసులు భారీగా నమోదవుతున్నాయి. గతవారం రోజుల నుంచి రోజువారీ కేసులు 2 లక్షలు దాటేస్తుండగా.. మరణాలు క్రమంగా పెరుగుతున్నాయి. మరోవైపు, కరోనాతో ఆస్పత్రిలో చేరేవారి సంఖ్య కూడా పెరుగుతుండటం ఆందోళనకు గురిచేస్తోంది. కాగా, సెకెండ్ వేవ్‌లో తీవ్రంగా ప్రభావితమైన కేరళలో మరోసారి వైరస్ ఉద్ధృతమవుతోంది. ఆ రాష్ట్రంలో రోజువారీ కేసులు ఒక్కసారిగా పెరగడంతో పినరయి విజయన్ సర్కారు అప్రమత్తమయ్యింది.ఒమిక్రాన్ వేరియంట్ వేగంగా వ్యాప్తి చెందినా.. ఇన్‌ఫెక్షన్ తీవ్రత తక్కువగానే ఉంటుందని పలు నివేదికలు చెబుతున్నాయి. అయితే, దీనికి భిన్నంగా కేరళలో ఆస్పత్రుల్లో చేరే బాధితుల సంఖ్యలో పెరుగుదల నమోదయ్యింది. నిన్న ఒక్క రోజే ఐసీయూ పడకలు 15 శాతం, ఆక్సిజన్ పడకలు 20 శాతం మేర డిమాండ్ పెరిగింది. ఈ సమయంలో వృద్ధులు, అనారోగ్య సమస్యల ఉన్నవారికి ముప్పు పొంచి ఉందని ఆరోగ్య నిపుణులు ఆందోళన చెందుతున్నారు. తొలి రెండు వేవ్‌ల్లో సురక్షితంగా ఉన్నవారు ఇప్పుడు ముప్పును ఎదుర్కొంటున్నారని అన్నారు."వ్యాప్తి ఎక్కువగా ఉంటే తేలికపాటి వేరియంట్ కూడా తీవ్రమైన సమస్యలను కలిగిస్తుంది.. ఇప్పటికే దీనికి సంబంధించిన కొన్ని సూచనలు కనిపిస్తున్నాయి.. హాస్పిటల్ అడ్మిషన్లు,ఐసీయూ, ఆక్సిజన్ కోసం డిమాండ్ ఒక రోజులో పెరిగింది"అని తిరువనంతపురం మెడికల్ కాలేజీ కమ్యూనిటీ మెడిసిన్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టీఎస్ అనిష్ పేర్కొన్నారు.ఇదే సమయంలో కేరళ సెక్రటేరియట్ కరోనా హాట్‌స్పాట్‌గా మారింది. సీఎంఓలోని పొలిటికల్ సెక్రటరీ సహా ఆరుగురు ఉద్యోగులు, దేవాదాయ, ఆరోగ్య శాఖల కార్యాలయాల్లోని సిబ్బంది పెద్ద సంఖ్యలో కరోనా బారినపడ్డారు. దాదాపు 80 మంది ఉద్యోగులకు కోవిడ్ సోకింది. ఇప్పటికే కేరళ విద్యాశాఖ మంత్రి వి శివన్‌కుట్టికి కోవిడ్-19 పాజిటివ్ వచ్చింది.

## ప్రభుత్వ జీవోలకు వ్యతిరేకంగా కలిసి పనిచేస్తున్నాం: వెంకట్రామిరెడ్డి

అమరావతి: ప్రభుత్వ జీవోలకు వ్యతిరేకంగా కలిసి పనిచేస్తున్నామని సచివాలయ ఉద్యోగ సంఘాల నేత వెంకట్రామిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పీఆర్సీ జీవోలను వెనక్కి తీసుకోవాలనేది తమ మొదటి డిమాండ్ అని చెప్పారు. అశుతోష్ మిశ్రా కమిటీ రిపోర్ట్ ఇవ్వాలని కోరుతున్నామని తెలిపారు. ఈ నెల పాత జీతాలనే చెల్లించాలని సీఎస్‌ను కోరామని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సూర్యనారాయణ తెలిపారు. "పీఆర్సీ సాధన సమితి" పేరుతో కలిసి పోరాడుతామని ప్రకటించారు. 12 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నామని, తమకు మద్దతు పలకాలని టీడీపీ అధినేత చంద్రబాబును కోరలేదన్నారు. తాము ఏ రాజకీయ పార్టీ మద్దతు కోరుకోవడం లేదని సూర్యనారాయణ పేర్కొన్నారు.

## ఇండియా టాప్ డెస్టినేషన్ గా గోవా



పానాజీ, జనవరి 21, : కరోనా ఒమిక్రాన్ ఆందోళన కలిగిస్తున్నా, ట్రావెల్ చేయడానికి ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. ఓయో విడుదల చేసిన యాన్యువల్ కన్జూమర్ సర్వే ప్రకారం, గోవా వెళ్లేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపించారు. ఈ సర్వేలో మొత్తం 3,000 మంది పాల్గొనగా, మూడో వంతు మంది గోవా తమ బకెట్ లిస్టు (ట్రావెల్ లిస్ట్) లో టాప్‌లో ఉందని చెప్పారు. కిందటేడాది డిసెంబర్‌లో ఓయో ఈ సర్వేను చేసింది. ట్రావెల్‌పిడియా పేరుతో ఈ సర్వేను రిలీజ్ చేసింది. ఈ సర్వే కోసం కేవలం ఇండియాలోనే కాకుండా ఓయోకి కీలకంగా ఉన్న ఇండోనేషియా, యూరప్ వంటి మార్కెట్లలోని రెస్పాండెంట్ల అభిప్రాయాలను కూడా కంపెనీ సేకరించింది. ఈ సర్వే ప్రకారం, 61 శాతం మంది ఇండియన్స్ లోకల్‌గా ట్రావెల్ చేయాలనుకుంటున్నారు. 25 శాతం మంది ఈ ఏడాది ఇంటర్నేషనల్‌తో పాటు, డొమెస్టిక్‌గా ట్రిప్‌లు వేయాలనుకుంటున్నారు. ట్రావెల్ చేయడానికి ఆసక్తి ఉన్నప్పటికీ, 80 శాతం మంది కరోనా కేసులు పెరుగుతుండడంపై ఆందోళన వ్యక్తం చేశారని ఈ సర్వే వెల్లడించింది. కానీ, బూస్టర్ డోస్ అందుబాటులోకి రావడంతో కొంత రిలీఫ్‌గా అనిపిస్తోందని చెప్పారు. ఫేవరేట్ డెస్టినేషన్ల పరంగా చూస్తే,ఈ ఏడాది తమ బకెట్ లిస్ట్‌లో గోవా టాప్ డెస్టినేషన్‌గా ఉందని చెప్పారు. దీని తర్వాత మనాలి, దుబాయ్, షిమ్లా, కేరళలు ఇండియన్ల టాప్ డెస్టినేషన్లుగా ఉన్నాయని ఓయో పేర్కొంది. ఇంటర్నేషనల్ డెస్టినేషన్లలో దుబాయ్‌తో పాటు మాల్దీవ్‌లు, పారిస్, బాలి, స్విట్జర్లాండ్ వంటి డెస్టినేషన్లు ఈ ఏడాది ఇండియన్ల బకెట్ లిస్టులో ఉన్నాయని ఓయో ట్రావెల్‌పిడియా వెల్లడించింది. ట్రావెల్ ఎవరితో చేయాలనే అంశంపై 37 శాతం మంది స్పౌజ్ (భార్య లేదా భర్త) తో కలిసి వెళ్తామని చెప్పారు. మరో 19 శాతం మంది క్లోజ్ ఫ్రెండ్స్‌తో ట్రావెల్ చేస్తామని చెప్పగా, 16 శాతం మంది ఫ్యామిలీతో కలిసి వెళతామని చెప్పారు. మరో 12 శాతం మంది సోలో బ్యాక్‌ప్యాకింగ్‌కు ఎక్కువ ఆసక్తి చూపించారు. 16 శాతం మంది మాత్రం స్పౌజ్‌తో నైనా, ఫ్యామిలీతోనైనా, ఫ్రెండ్స్‌తోనైనా, సోలోగానైనా వెళ్లడానికి ఓకే అన్నారు. ఓయో ట్రావెల్‌పిడియా ప్రకారం, ఇండోనేషియాలో టాప్ డెస్టినేషన్‌గా బాలి నిలిచింది. యూరప్‌లో బాల్టిక్ సముద్రంలోని డానిష్ ఐలాండ్ బోర్న్‌హోమ్‌కు వెళ్లేందుకు అక్కడి ప్రజలు ఎక్కువ ఆసక్తి చూపించారని ఓయో ప్రకటించింది. ఈ సర్వే ప్రకారం, నెదర్లాండ్‌లోని మెజార్టీ ప్రజలు ఈ ఏడాది ఆస్ట్రియాను చూడాలనుకుంటున్నారు.

## ఏపీలో పెరుగుతున్న కరోనా కేసులు

అమరావతి: రాష్టంలో కరోనా చాప కింద నీరులా వ్యాపిస్తోంది. రోజురోజుకూ కేసుల సంఖ్య వేలల్లో పెరుగుతోంది. గడిచిన 24 గంటల్లో రాష్టంలో కొత్తగా 13,212 కరోనా కేసులు నమోదయ్యాయి. ఈ రోజు నమోదయిన కేసులతో కలిపి రాష్ట్రవ్యాప్తంగా 21,53,268కు కరోనా కేసులు చేరాయి. గడిచిన 24 గంటల్లో ఐదుగురు మృతి చెందారు. ఇప్పటివరకు కరోనాతో రాష్టంలో 14,532 మంది మృతి చెందారు. ప్రస్తుతం ఏపీలో 64,136 కరోనా యాక్టివ్ కేసులున్నాయి. కరోనా నుంచి 20,74,600 మంది రికవరీ అయ్యారు. రాష్టంలో కొవిడ్ మహమ్మారి అంతకంతకూ విజృంభిస్తోంది. ఎక్కడికక్కడ వ్యాపిస్తూ వేల మందిని చుట్టేస్తోంది. ఫలితంగా రాష్టంలో కేసుల సంఖ్య క్రమేపీ పెరిగిపోతోంది. దీంతో ఎక్కడ చూసినా మళ్లీ కొవిడ్ భయం అలుముకుంటోంది. మునుపటి సెకండ్ వేవ్ తరహాలో కేసులు పంజా విసురుతాయోమననే ఆందోళన అందరూ హడలిపోతున్నారు.

## మరో ఎన్నికలకు అంతా సిద్ధం..!

(మొదటి పేజీ తరువాయి)

మాత్రమే ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయా ఈవీఎంలకు వీవీప్యాట్‌లను అనుసంధానం చేసే అంశంపై ప్రభుత్వరంగ సంస్థ ఈసీఐఎల్‌ను సంప్రదించి తదుపరి చర్యలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. కోర్టు కేసులపైనా దృష్టి ఎన్నికలు జరగని 22 నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీలకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయ అధికారులు ఎప్పటికప్పుడు మునిసిపల్‌శాఖ అధికారులతో సంప్రదిస్తున్నారు. నెలరోజుల కిందట నీలం సాహ్ని మునిసిపల్‌శాఖ అకారులతో సమావేశమై ఆయా కేసుల పరిస్థితి గురించి తెలుసుకున్నారు.

## పీఆర్సీ సహా పలు కీలక అంశాలకు కేబినెట్ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లో రైతుకు చెల్లింపు
ఉద్యోగుల నూతన పీఆర్సీకి ఆమోదం
కోవిడ్‌తో చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకం
అగ్రవర్ణాల పేద మహిళలకు 45 వేలు ఆర్థిక సహాయం
ఏటా 15 వేలు చొప్పున 45 ఏళ్ళ నుండి 60 ఏళ్ల మధ్య పేద మహిళలకు ఇవ్వాలని క్యాబినెట్ నిర్ణయం
కిదాంబి శ్రీకాంత్ స్పోర్ట్స్ అకాడమీకి తిరుపతిలో ఐదెకరాల భూమి కేటాయింపు
విశాఖలో అదాని డేటా సెంటర్‌కు భూ కేటాయింపు ప్రతిపాదనకు ఆమోదం
వన్ డిస్ట్రిక్ట్-వన్ మెడికల్ కాలేజీ ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం.

## బీజేపీ, జనసేనకు షాకేనా ?

(మొదటి పేజీ తరువాయి)

. మామూలుగా రెండున్నరేళ్ళ పాలన తర్వాత ఎంతోకొంత జనాల్లో అసంతృప్తి మొదలవ్వటమో లేకపోతే పెరగటమో సహజమే. కానీ ప్రజాదరణ తగ్గలేదంటే బహుశా అమలవుతున్న సంక్షేమ పథకాలు కారణమై ఉండాలి... లేదంటే సర్వేలో శాస్త్రీయతపై ఏవైనా పొరపాట్లు ఉండాలి.

## ఎం .డి .యు వాహనాల ర్యాలీ ప్రదర్శన



పొన్నూరు జనవరి21 (ప్రజాపాలన ప్రతినిధి) :రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇంటింటికి నిత్యావసర సరుకుల పథకానికి ఏడాది పూర్తయింది. దీనిలో భాగంగా పొన్నూరు పట్టణం లో ఎం. డి .యు వాహనాల సిబ్బంది ర్యాలీ ప్రదర్శన గావించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద సివిల్ సప్లై అధికారి ఓంకార్ గారు జెండా ఊపి ర్యాలీ ప్రదర్శన ప్రారంభించారు. జి బి సి రోడ్, గాంధీ బొమ్మ సెంటర్, చింతలపూడి రోడ్డు, నిడుబ్రోలు ప్రాంతాలలో ర్యాలీ జరిగింది. సివిల్ సప్లై అధికారి ఓంకార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటింటికి రేషన్ పథకం విజయవంతంగా ఏడాది కాలం పూర్తి చేసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆపరేటర్లు షేక్ చాంద్ బాషా ఆకుల హరి గోపి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నరసరావుపేట పట్టణంలో పెద్ద చెరువులో పర్యటించిన నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ



నరసరావుపేట. ప్రజాపాలన :నరసరావుపేట పట్టణంలోని స్థానిక 25 వార్డ్ పెద్దచేరువు నందు నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు విస్తృతంగా పర్యటించారు.వార్డ్ కు విచ్చేసిన డా.చదలవాడకు నాయకులు,కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు.వార్డులో టీడీపీ నాయకులు,కార్యకర్తలతో పర్యటించి నెలకొన్న సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా డా.చదలవాడ మాట్లాడుతూ పెరిగిన ధరలతో రాష్ట్ర ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు.ప్రజా సమస్యల పై ప్రభుత్వం పట్టకుండా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## బూతుల మంత్రిని అరెస్ట్ చేయాలి: దేవినేని

కృష్ణా: గుడివాడలో టీడీపీ నేతలపై దాడిని ఖండిస్తున్నామని టీడీపీ మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. అక్రమ సంపాదన గుట్టు బయట పడడంతోనే కేసీనో మంత్రి అసహనంతో బూతులు మాట్లాడుతున్నారని దేవినేని విమర్శించారు. బూతుల మంత్రిని వెంటనే బర్తరఫ్ చేసి..అరెస్ట్ చేయాలని ట్విటర్‌లో దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు.

ప్రజాపాలన

సంపాదకీయం

శనివారం 22, జనవరి 2022

## స్వావలంబన లేని సంస్కరణలు ఏల?

భారతదేశంలో వ్యవసాయ వాణిజ్య కంపెనీలను పైకి తీసుకురావడానికి కమీషన్ ఏజెంట్లను నిందించే ప్రక్రియను పద్ధతి ప్రకారం కొనసాగిస్తున్నారు. వ్యవసాయరంగంలో మధ్య దళారీలను నియంత్రించాల్సిందే. కానీ, మాంస పరిశ్రమను బలోపేతం చేయాలని తలపెట్టిన ప్రయత్నం, కొన్ని కంపెనీల చేతుల్లో మార్కెట్ కేంద్రీకృతం అవడానికి కారణమయ్యిందని అమెరికన్ అనుభవం చెబుతోంది. మార్కెట్ చలన సూత్రాలు అమెరికా రైతులకు ప్రశాంతమైన జీవితాన్ని అందించడంలో మళ్లీ విఫలమయ్యాయి. రైతుల పంటలకు మద్దతు ధర కల్పించాలనే కీలక సమస్యను గుర్తించడంలో విఫలమవుతున్నందునే అంతర్జాతీయంగా రైతులు నిరంతర నష్టాలు అనే పెను భారాన్ని మోయవలసి వస్తోంది. అమెరికా వ్యవసాయ రంగంలో గత అర్ధ శతాబ్దంపైగా ప్రవేశపెడుతూ వచ్చిన మార్కెట్ సంస్కరణల వైఫల్యం నుంచి మన విధాన నిర్ణేతలు, ఆర్థిక వేత్తలు ఎలాంటి గుణపాఠాలూ నేర్చుకోవడం లేదు. చివరకు ఇటీవలే వివా దాస్పదమైన మూడు వ్యవసాయ సంస్కరణ చట్టాలను రద్దుచేసిన తర్వాత కూడా, సరఫరా–డిమాండ్ మధ్య సమతౌల్యమే ధరలను నిర్ణయిస్తుందని ఇప్పటికీ వీరు పాత పాటే వల్లె వేస్తున్నారు. మార్కెట్ చలన సూత్రాలు అమెరికా రైతులకు ప్రశాంతమైన జీవితాన్ని అందిం చడంలో మరోసారి విఫలమయ్యాయి. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఈ వాస్తవాన్ని చక్కగా గుర్తించారు. ఇటీవలే ఒక ప్రకటనలో యాభై ఏళ్లకు ముందు అమెరికా రైతులు మాంసాహార ఉత్పత్తులపై సంపాదించిన రాబడుల్లో సగం కూడా ఇప్పుడు వారికి లభించడం లేదని బైడెన్ చెప్పారు. “50 ఏళ్ల క్రితం అమెరికాలో రైతులు, బీఫ్ ఉత్పత్తిపై వెచ్చించిన ప్రతి డాలర్‌కి 60 సెంట్ల రాబడిని సంపాదించేవారు. ఈరోజు వారికి 39 సెంట్లు మాత్రమే దక్కుతోంది. అలాగే 50 ఏళ్ల క్రితం పందుల్ని పెంచిన రైతులు వెచ్చించిన ప్రతి డాలర్ ఖర్చుకు 48 నుంచి 50 సెంట్ల రాబడి సాధించేవారు. కానీ ఈరోజు వారి రాబడి 19 సెంట్లకు పడిపోయింది. అదే సమయంలో బడా కంపెనీలు మాత్రం భారీ లాభాలను సాధిస్తున్నాయి.” ఒక సంవత్సర కాలంలో బీఫ్ ధరలు 21 శాతం, పంది మాంసం ధర 17 శాతం, చికెన్ ధర 8 శాతం పెరిగినట్లు అమె రికా వ్యవసాయ విభాగం (యూఎస్‌డీఏ) అంచనా వేసిన సమయం లోనే రైతుల రాబడి ఇంతగా పడిపోయిందని గ్రహించాలి. “వ్యవసాయ వాణిజ్య సంస్థల లాభాలు పెరిగే కొద్దీ దుకాణాల్లో సరకుల ధరలు కూడా భారీగా పెరుగుతూ వచ్చాయి. కానీ మార్కెట్లకు తమ ఉత్పత్తులను తీసుకొచ్చిన రైతులకు దక్కాల్సిన ధరలు మాత్రం పడిపోయాయి” అంటూ అమెరికా అధ్యక్షుడు మరిన్ని వివ రాలు తెలిపారు. అమెరికా వ్యవసాయ శాఖ కార్యదర్శి టామ్ విల్‌సక్ దీనికి బలం చేకూరుస్తూ ట్వీట్ చేశారు. “ఈ వేసవిలో, లోవా రాష్ట్రంలో ఒక రైతును కలిశాను. ‘ఒక పశువును 150 డాలర్లకు అమ్మి నేను నష్టపోయాను. కానీ దాని మాంసాన్ని ప్రాసెస్ చేసి అమ్మినవాడు మాత్రం ఒక్కో పశువుకు 1,800 డాలర్ల లాభం సంపాదించాడు’ అని ఆ రైతు వాపోయాడు.” ఒకవైపు రైతుల ఆదాయాన్ని హరిస్తూ, మరో వైపు లాభాలు ఆర్జిస్తున్న మాంసాహార ప్రాసెసింగ్ కంపెనీల లాభాలు ఏ స్థాయిలో ఉంటున్నాయో ఈ ఒక్క ఉదాహరణ నుంచే ఊహించు కోవచ్చని టామ్ చెప్పారు. భారతదేశంలో, రైతులను నిలువుదోపిడీ చేస్తున్నందుకు వ్యాపా రులను, లాభాలు దండుకుంటున్న కమిషన్ ఏజెంట్లను మనం కచ్చి తంగా నిందించాల్సిందే. అమెరికాలో 85 శాతం మాంస పరిశ్రమను నియంత్రిస్తున్న నాలుగు మాంసాహార దిగ్గజ సంస్థలను వాస్తవానికి భారీస్థాయి దళారీలనే చెప్పాలి. వీళ్లు సముద్ర సొరచేపలకు ఏమాత్రం తక్కువ కాదు. భారతదేశంలో వ్యవసాయ వాణిజ్య కంపెనీలను పైకి తీసుకురావడానికి కమీషన్ ఏజెంట్లపై నిందమోపే ప్రచారాన్ని పద్ధతి ప్రకారం చేస్తూ వస్తున్నారు. మధ్య దళారీలను నియంత్రించాల్సిందే. కానీ, మాంస పరిశ్రమను బలోపేతం చేయాలని తలపెట్టిన ప్రయత్నం, కొన్ని కంపెనీల చేతుల్లో మార్కెట్ కేంద్రీకృతం అవడానికి కారణమయ్యిందని అమెరికన్ అనుభవం చెబుతోంది. మాంస ఉత్ప త్తుల ధరలు పడిపోవడంతో తరాలుగా పశువులు, పందులు, కోళ్లను పెంచుతున్న రైతు కుటుంబాలు కుప్పగూలిపోయాయి. వ్యవసాయంలో స్వేచ్ఛా మార్కెట్ల రాకతో జరిగిన విధ్వంసం అమెరికా వ్యవసాయరంగం కుప్పగూలిపోయిన తీరుకు సజీవ సాక్ష్యంగా నిలుస్తుంది. అదే క్రమంలో రైతులకు న్యాయమైన ధరలను కల్పించడంలో సరఫరా%--%డిమాండ్ సమతౌల్యం మరింత చెత్త ఫలితాలను తీసుకొచ్చింది. మొదట్లో ఈ పతనం వ్యవసాయ సరు కులు, పాల పరిశ్రమలో సంభవించగా ఇప్పుడు పశు మాంస వ్యవ సాయం దాని బారినపడింది. వ్యవసాయ దిగుబడుల నుంచి రిటైల్ మార్కెట్ దాకా సప్లయ్ చైన్ క్రమం మొత్తంగా బలపడుతూ వచ్చింది. నిజానికి ఈ కేంద్రీకరణ గుత్తాధిపత్యానికి, బలప్రదర్శనకు దారి తీసింది. వ్యవసాయ వాణిజ్య కంపెనీలు, సిండికేట్‌గా ఏర్పడిన క్రమం అనేది అటు వ్యవసాయ ఉత్పత్తిదారులనూ, ఇటు వినియోగ దారులనూ నిర్దాక్షిణ్యంగా దోపిడీ చేయడంతో ముగిసింది. తమ రక్త మాంసాలను బహుళజాతి కార్పొరేషన్లు పీల్చేస్తుండటానికి వ్యతిరే కంగా అమెరికా జాతీయ రైతుల యూనియన్ దేశవ్యాప్త ప్రచారాన్ని నిర్వహిస్తోంది. కార్పొరేట్ గుత్తాధిపత్యాన్ని బద్దలు చేసి రైతులకు న్యాయం చేయడం, యాంటీ–ట్రస్ట్ చట్టాలను కఠినంగా అమలు చేయాలని వీరు డిమాండ్ చేస్తున్నారు. అమెరికా ప్రభుత్వం రైతుల డిమాండ్ల పట్ల స్పందించింది. ధరలను భారీగా పెంచేలా ఆర్థిక వ్యవస్థను నడుపుతున్న కొన్ని వ్యవసాయ వాణిజ్య దిగ్గజ సంస్థలపై వేటు వేయాలని దేశాధ్యక్షుడు బైడెన్ పిలుపునిచ్చారు. పరిశ్రమలోని దిగ్గజాలతో పోటీ పడేందుకు చిన్నతరహా మాంసాహార ప్రాసెసింగ్ విభాగాల్లో ఒక బిలియన్ డాలర్ల మేరకు పెట్టుబడులను ప్రభుత్వం ఆమోదించింది. ఇది సమగ్ర పరి ష్కారం కానప్పటికీ, ఉత్పత్తిదారులు, వినియోగదారులు ఇరువు రిపై తీవ్ర ప్రభావం చూపుతున్న కార్పొరేట్ గుత్తసంస్థల విధ్వంసాన్ని కాస్త అర్థం చేసుకోవడానికి ప్రభుత్వ చర్య తోడ్పడింది. వ్యవసాయ సరు కులు, పశుసంపదను ఉత్పత్తి చేసే రైతులకు మద్దతు ధర కల్పించడమే ఉత్తమమార్గం. భారతీయ రైతులు కూడా కనీస మద్దతు ధరకు చట్ట బద్ధతను కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మద్దతు ధరకు దిగువన ఎలాంటి వ్యాపార లావాదేవీలూ సాగవద్దన్నదే రైతుల డిమాండ్. యూరప్‌లో కూడా తమను వెంటాడుతున్న వ్యవసాయ సంక్షోభం నుంచి బయట పడేయడానికి న్యాయమైన ధరలకు హామీ కల్పించాలని రైతులు పదేపదే నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. కొన్ని దశాబ్దాలుగా వ్యవసాయ రంగ ఆదాయాలు పడి పోతుండటమే... ప్రపంచ వ్యవసాయ సంక్షోభానికి ప్రధాన కారణం. వ్యవ సాయ సంక్షోభం, పరిష్కారాలపై కెనడా జాతీయ రైతుల యూనియన్ 2005లో ఒక నివేదికను సమర్పించింది. గత 20 ఏళ్లుగా వ్యవసాయ ఆదాయాల్లో కనీవినీ ఎరుగని సంక్షోభానికి కారణాలను ఈ నివేదిక వివరించింది. 1985, 2005 మధ్య వ్యవసాయ ఆదాయాలు తిరోగ మన ధోరణిలో కొనసాగాయి. గత 20 ఏళ్ల కాలంలో ద్రవ్యోల్బణాన్ని సర్దుబాటు చేసిన తర్వాత వ్యవసాయ పంటల ధరలు స్తబ్దతలో ఉండిపోయిన వైనాన్ని అంక్టాడ్ (యూఎన్‌సీటీఏడీ) కూడా స్పష్టంగా పేర్కొంది.

# ‘సైబర్’ కనుమలో అసత్యసేన

స్వాతంత్ర్య అమృతోత్సవాలు జరుపుకుంటున్నాం. వినూత్న సాంకేతికతలు మన సమష్టి శ్రేయస్సుకు నిర్దేశించుకున్న విలువలు, సంప్రదాయాలకు ప్రమాదకారులుగా పరిణమిస్తున్నాయి. అవును, మన సమున్నత భారత ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యం (రిపబ్లిక్ ఆఫ్ ఇండియా) అంతర్జాల పోకిరీ సేన (ఆర్మీ ఆఫ్ ట్రోల్స్) ఆక్రమణకు గురవుతోంది. విద్వేష జాలం, అసత్య ప్రచారం వెల్లువెత్తుతున్నాయి. ఆ పోకిరీల ప్రభావం ఇప్పటికే మన ప్రజా చర్చలను, పౌర సమాజ వాదోపవాదాలను, సామాజిక సంభాషణలను హీనస్థాయికి దిగజార్చింది. భారతీయ జాతీయతకు అపాయం కలిగిస్తోంది. ఒక వంచనా సామ్రాజ్యాన్ని నెలకొలిపే దిశలో చురుగ్గా పురోగమిస్తోంది. ఈ పోకిరీల దండయాత్ర భారత గణతంత్ర రాజ్యానికే కాదు, మన పురానవ నాగరికతకూ ఒక పెనుముప్పు. స్టాండప్ ప్లీజ్! అంతర్జాల పోకిరీ సైన్యాన్ని సవాల్ చేయవలసిన సమయమిది. ఇదొక విషమ ఘడియ. సంయమనం ఇక చాలు. ప్రతిఘటనను ప్రారంభించి తీరాలి. ఒక సత్య (యోధుల) సైన్యాన్ని సమీకరించాలి. ఆకాంక్ష మాత్రమేనా? కానే కాదు. ఇదిగో ఒక నిర్దిష్ట ప్రతిపాదన. భారత గణతంత్ర రాజ్య సంరక్షకులు అందరూ తమ తమ రాజకీయ విభేదాలు, శత్రుత్వాలను కొనసాగిస్తూనే ఒక లక్ష్యం కోసం ఏకమవ్వాలి. దేశ పాలనా వ్యవహారాలను నిర్వహిస్తున్న రాజకీయ సంస్థ, దాని ఆస్థానికులు, సమస్త సమర్థకులు అలుపు సొలుపు, నదురు బెదురు లేకుండా సత్యాలుగా వ్యాప్తి చేస్తున్న అబద్ధాల బండారాన్ని బద్దలుగొట్టి, నిజాలను వెల్లడించడమే ఆ లక్ష్యం. ఈ లక్ష్యాన్ని ఔదలదాల్చిన వారందరూ సంఘటితమవ్వాలి. ఇందుకొక మేధో మండలిని ఏర్పాటు చేసుకోవాలి. సమాజ సంబంధిత ప్రతి విషయాన్ని సులభంగా, సుబోధకంగా తెలియజేసేందుకు ఒక పటిష్ఠ, ప్రభావశీల ప్రణాళికను రూపొందించుకోవాలి. ఈ అంగీకృత యోజనను శక్తిమంతమైన సందేశాలుగా మార్చి, వాటిని ప్రజలకు పంపేందుకు దేశవ్యాప్తంగా ఉత్తమ సృజనశీల ఆలోచనాపరులు అందరినీ ఒక సమైక్య వేదిక మీదకు తీసుకురావాలి. ఆ సందేశాలను పలు మార్గాలలో విభిన్న వేదికల ద్వారా ప్రజలకు చేరవేసేందుకు ఒక సమర్థ, సృజనశీల యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవాలి. లక్షలాది స్వచ్ఛంద సేవకులతో ఒక సమాహార వ్యవస్థను నెలకొల్పాలి. సమాజంలోని ప్రతి ఒక్క వ్యక్తితో సంధాయకతను సృష్టించుకోవాలి. తల్లి భాషల్లో, ప్రజల పలుకుబడుల ద్వారా సత్యం ప్రతి ఒక్కరి మనస్సుల్లో సుప్రతిష్ఠితమవ్వాలి. వాస్తవాలను నిశితంగా పరీక్షించవలసిందే. అయితే సత్యం అనేది వాస్తవాల తనిఖీకే పరిమితం కాకూడదు. వాటి ఆవలి వైపునకు వెళ్లి తీరాలి. అప్పుడే సత్యాసత్య వివేచన వికసిస్తుంది. అంతర్జాల పోకిరీ సేన వాస్తవాలను ఖాతరుచేయదు. భయపడదు







అని చెప్పడమే సరైన విషయం. కనుక అనుభవజన్య సత్యాలను ఆలంబన చేసుకోవాలి. ప్రజల అనుభవంలోకి వచ్చిన సత్యాలను విశదంగా వెల్లడించేందుకు అవసరమైన మార్గాలను కనుగొనవలసి ఉంది. సాధారణ వ్యవహారాలు, సుదూర సంఘటనల గురించి అబద్ధాలు చెప్పి ప్రజలను నమ్మించడం పెద్ద కష్టమేమీ కాదు. అయితే ప్రజల ప్రత్యక్ష అనుభవంలోని వాటిపై అసత్యాలను వ్యాప్తి చేయడం సాధ్యమవుతుందా? సమాధానం స్పష్టమే. ఉదాహరణకు లద్దాఖ్‌లో మన భూభాగాలు కొన్నిటిని చైనాకు కోల్పోయాం. అయితే లద్దాఖ్‌లో అంగుళం భూమిని కూడా చైనా ఆక్రమించలేదని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఘంటాపథంగా చెప్పింది. ఈ విషయంలో మోదీ సర్కార్ మసకబరిచిన సత్యాలను విస్పష్టంగా వెల్లడించడం అంత తేలికకాదు. అయితే కొత్త ఉద్యోగాల సృష్టి, కొవిడ్ సంక్షోభంలో మృతుల వాస్తవ సంఖ్య విషయమై పాలకుల మాటలను ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదు. జనుల వ్యక్తిగత అనుభవాలు ప్రభుత్వ గణాంకాలకు విరుద్ధంగా ఉంటాయి కదా. వాస్తవాలను నిరూపించడమే సరిపోదు. వాటి మధ్య ఉన్న పరస్పర సంబంధాన్ని గుర్తించాలి. అప్పుడు అవి మనకు ఒక కొత్త దృక్పథాన్ని సమకూరుస్తాయి. ఫెరోజ్‌పూర్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రాణాలకు పెద్ద ప్రమాదమేర్పడిందనే అతిశయోక్తులు ప్రచారమయ్యాయి. ఫెరోజ్‌పూర్ సంఘటనపై, ఆ ఘటన సంభవించిన మరుసటి రోజు వైరల్ అయిన వీడియోలు ఆ అతిశయోక్తుల గుట్టును బయటపెట్టాయి. ఇంతటితో సరిపుచ్చకూడదు. 2002 ఎన్నికలకు ముందు అక్షరధామ్‌పై జరిగిన దాడి నుంచి ఫెరోజ్‌పూర్ ఉదంతం దాకా ఎన్నికల సందర్భంగా సంభవించిన సంఘటనలు అన్నిటినీ నిశితంగా పరిశీలించండి. అవి సంభవించిన తీరులో ఒక రీతి మీకు స్పష్టంగా కనిపిస్తుంది. కేవలం అనుభవపూర్వక సత్యాలనే కాదు, భావోద్వేగ సత్యాలను కూడా సంధానం చేయడాన్ని నేర్చుకోవాలి. సాయుధ సైన్యానికి వలే సత్య సైన్యానికి కూడా ఒక వ్యూహాత్మక సిద్ధాంతం అవసరం. సత్య సైన్యం సూత్రప్రాయంగా సత్యానికే నిబద్ధమవుతుంది. శక్తిమంతమైన వ్యూహంగా సత్యంపైనే సదా ఆధారపడి ఉంటుంది. అత్యంత ఇబ్బందికరమైన పరిస్థితుల్లో కూడా ఎంత అననుకూలమైనది అయినప్పటికీ సత్యాన్నే మాట్లాడగల నైతిక ధైర్యం సత్య సైనికుడికి ఉండి తీరాలి. మీరు సత్యమని చెప్పినది స్వతంత్ర, నిష్పాక్షిక పరిశీలనలో కూడా సత్యంగా రుజువు కావాలి. అప్పుడు మాత్రమే అది ప్రజా సత్యమవుతుంది. అంతర్జాల పోకిరీసేన ప్రతిరోజూ హిందూ%--%ముస్లిం వ్యవహారాలపై వాదోపవాదాలకు మనలను ఆహ్వానిస్తుంది. మన ప్రతిస్పందన ఏమైనప్పటికీ సమాజంలో ఆ మత వర్గాల వారి మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగేలా చేయడమే ఆ పోకిరీల లక్ష్యం. మరి వారికి మనం విసిరే వ్యూహాత్మక సవాల్ ఎలా ఉండాలి? మన సవాల్‌కు ఆ పోకిరీలు ఆత్మ రక్షణలో పడి తీరాలి. పోరాట క్షేత్రాలను వేరే అంశాలకు మళ్ళించడమే అందుకు మార్గం. ఇదే వారికి మనం విసరగల సరైన సవాల్. సత్య సైన్యం భారతీయ భాషలను ఆలంబన చేసుకోవాలి. ప్రజల నుడికారంలో మాట్లాడాలి. ప్రభావశీల ఆయుధాలుగా హాస్యం, అధిక్షేపం, వ్యంగ్యాన్ని ప్రయోగించాలి. అప్పుడు అబద్ధాల బండారాన్ని బయటపెట్టడం సాధ్యమవుతుంది. ప్రజలకు సత్యం తెలుస్తుంది. మనం ఇప్పుడు సత్యానంతర ప్రపంచంలో నివశిస్తున్నాం. ఈ కొత్త జగత్తులో సత్యశీల రాజకీయాలకు తావు ఉందా? ఉందని నేను విశ్వసిస్తున్నాను. అంతర్జాల పోకిరీల ప్రచారాన్ని చూస్తే సత్యం విలువ ఏమిటో మనకు తెలుస్తుంది. లఖింపూర్ ఖేరీ ఘటనపై మీడియా సంపూర్ణ మద్దతుతో జరిగిన ప్రచారాన్ని గుర్తు చేసుకోండి. అయితే నిరసన తెలుపుతున్న రైతుల పైకి కేంద్రమంత్రి సుపుత్రుడు ఎంత నిర్లక్ష్యంగా, ఎంత నిర్దాక్షిణ్యంగా కారును నడిపిందీ స్మార్ట్ ఫోన్‌లో నిక్షిప్తమైన దృశ్యాల వీడియో మరుసటిరోజు సామాజిక మాధ్యమాలలో వైరల్ అయిన తరువాత జరిగిందేమిటో మీకు తెలుసు. ఎంత దుర్మార్గం జరిగిందో ప్రతి ఒక్కరూ అర్థం చేసుకున్నారు. అలాగే ఇబ్బందికరమైన వాస్తవాలను ఏ ప్రభుత్వమూ ఎంతోకాలం కప్పిపుచ్చలేదు. ఎందుకంటే సత్యమే ముఖ్యం. సత్యమే అత్యంత ప్రభావశీల శక్తి. కొత్త సాగు చట్టాలపై రైతుల ఉద్యమాన్నే చూడండి. మట్టి మనుషుల భావోద్వేగ సంకల్పం ఎండా వానల్లో సైతం వీధుల్లోనే ఉండి తీరేలా చేసింది. చివరకు మోదీ ప్రభుత్వం తన నిర్ణయాలు ఉపసంహరించుకునేలా చేసింది.

సత్య (యోధుల) సైన్యాన్ని ఎక్కడ సమీకరించాలి? మనలో సత్యాన్వేషకులు ఉన్నారా? ఉన్నారు. మెగసెసే అవార్డు గ్రహీత అయిన ప్రముఖ పాత్రికేయుడు రవిష్ కుమార్‌ను సామాజిక మాధ్యమాలలో అనుసరిస్తున్న వారి సంఖ్యను పరిశీలించండి. పెద్ద మీడియా సంస్థలన్నీ అత్యంత గర్హనీయంగా అధికారంలో ఉన్న వారికి లొంగిపోయాయి. దీంతో ప్రతి రాష్ట్రంలోనూ, జిల్లాలోనూ చిన్న యూట్యూబ్ ఛానెల్స్ ప్రభవించి వర్ధిల్లుతున్నాయి. వీటిని అనుసరించే వారు చాలా పెద్ద సంఖ్యలో ఉన్నారు. వారంతా సత్యాన్ని కోరుకుంటున్నారు. సత్యావిష్కరణ జరిగితీరాలని వారు ప్రగాఢంగా అభిలషిస్తున్నారు. రైతుల ఉద్యమమే ఇందుకొక రుజువు. సత్య సమరంలో సైనికులు అయ్యేందుకు అనేక మంది స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. ఒక పెద్ద సత్య సైన్యం సత్య సంరక్షణకు సంసిద్ధంగా ఉంది.

సరే, ఈ స్వచ్ఛంద సత్యశీలురను ఒక సైన్యంగా ఎందుకు పిలవాలి? ప్రజాపోరాటాలు శాంతియుతంగా జరగాలని కోరుకుంటున్నవారు నా ప్రతిపాదనలోని సైనిక ధర్మధోరణికి కలవరపడుతున్నారు. అయితే మహాత్మాగాంధీ జీవిత అంతిమ దశను ఒకసారి గుర్తుచేసుకోండి. దేశ విభజనతో ప్రజ్వరిల్లిన మత విద్వేష హింసాకాండను నివారించేందుకు ఆయన ఏర్పాటు చేసింది శాంతి సేన కాదూ? వాస్తవమేమిటంటే మనం ఇప్పుడు ఒక యుద్ధంలో ఉన్నాం. మన జాతిని, మన నాగరికతను, మన గణతంత్ర రాజ్యాన్ని రక్షించుకునేందుకు జరుగుతున్న యుద్ధమది. ఈ పవిత్ర యుద్ధాన్ని విజయవంతం చేసేందుకు మీకు ఒక సైన్యం తప్పక అవసరమవుతుంది. అదే సత్య సైన్యం.

తాజా కలం: బహు భాషా కోవిదుడు జీఎన్ దేవీ ఒక భిన్న సూచన చేశారు. నేను ప్రతిపాదించిన ‘ట్రూత్ ఆర్మీ’ (సత్య సైన్యం)ని ‘ట్రోత్ ఆర్మీ’గా పిలవాలని ఆయన అన్నారు. ట్రోత్ అనేది వాడుకలో లేని పదం. దాని అర్థం కోసం నిఘంటువు చూశాను. ప్రమాణం, ప్రతిజ్ఞ, వాగ్దానం అనే అర్థాలు కనిపించాయి. భారత స్వాతంత్ర్యం 75వ వసంతంలో ‘భవిష్యత్తుతో మన సమష్టి సమాగమానికి’ ఒక ట్రోత్ సైన్యం అవసరం చాలా ఉంది.

# విరాట్ పర్వం

కెప్టెన్సీ నుంచి వైదొలగుతున్నట్లు విరాట్ కోహ్లీ ప్రకటించడంతో భారత టెస్టు క్రికెట్‌లో ఒక పర్వం ముగిసినట్లైంది. దక్షిణాఫ్రికా చేతిలో 2–1 తేడాతో టెస్టు సిరీస్‌ను కోల్పోయిన తరువాతి రోజే విరాట్ కోహ్లీ ఈ బాంబు పేల్చాడు. వచ్చే నెలలో శ్రీలంకతో బెంగళూరులో మొదటి టెస్టు కోహ్లీకి వందో టెస్టు. ఈ మ్యాచ్‌లో ఆడిన తరువాత కావాలనుకుంటే అభిమానుల సమక్షంలో కెప్టెన్సీ నుంచి వీడ్కోలు తీసుకోవచ్చని భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బిసిసిఐ) చేసిన ప్రతిపాదనను అతడు తిరస్కరించినట్లు వార్తలొచ్చాయి. ఒక మ్యాచ్‌తో మారిపోయేదేమీ ఉండదని, ఏ పని చేసినా 120 శాతం ఫలితం సాధించాలి. లేనప్పుడు తప్పుకోవాలన్నదే తన ఫిలాసఫీ అని కోహ్లీ విస్పష్టంగా చెప్పాడు. చాలా మంది కెప్టెన్లు తాను నిష్క్రమించడానికి ముందు మెరుపులు మెరిపించి అభిమానులతో భేష్ అనిపించుకోవాలని ఆరాటపడతారు. కోహ్లీ అందుకు భిన్నమైన మార్గాన్ని ఎంచుకున్నాడు. కెప్టెన్‌గా ఉంటూ వరుసగా మూడు సెంచరీలు సాధించిన ఆటగాడిగా అరుదైన రికార్డును సొంతం చేసుకున్న విరాట్ కోహ్లీ నిష్క్రమణలోను తన విలక్షణతను చాటుకున్నాడు. భారత క్రికెట్ జట్టును సమర్థవంతంగా నడిపించడంలో విజయవంతమైన సారథిగా అతనికి మంచి పేరే ఉంది. అతడు కెప్టెన్సీగా బాధ్యతలు చేపట్టడానికి ముందు అంతర్జాతీయ క్రికెట్ రేటింగ్స్‌లో ఏడవ స్థానంలో ఉన్న భారత జట్టును మెరుగైన స్థితిలో నిలబెట్టడంలో తనదైన ముద్ర వేశాడు. కోహ్లీ సారథ్యంలో భారత్ 68 టెస్టులు ఆడగా 40 మ్యాచ్‌లలో విజయం సాధించింది. కేవలం 17 మ్యాచ్‌లలోనే ఓడిపోయింది. స్వదేశంలో జరిగిన 11 టెస్టు సిరీస్‌లను కైవసం చేసుకున్న కోహ్లీ సేన, విదేశాల్లో 37 టెస్టులు ఆడి 16 విజయాలను నమోదు చేసుకుంది. 43.6 శాతం సగటు విజయాల రేటుతో కెప్టెన్‌గా బాగానే రాణించాడు. అంతకు ముందు కెప్టెన్ ఎం.ఎస్ దోని ఇతర ఫార్మేట్లలో రాణించినా, టెస్టుల్లో అంతగా క్లిక్ కాలేకపోయాడు. మరో మాజీ కెప్టెన్, ప్రస్తుత బిసిసిఐ చైర్మన్‌గా ఉన్న సౌరబ్ గంగూలీ 28 టెస్టులు ఆడి 39.3 సక్సెస్ రేటుతో కోహ్లీ తరువాతి స్థానంలో నిలిచాడు. ఏ విధంగా చూసినా కోహ్లీ సారథ్యంలో భారత టెస్టు క్రికెట్ పరిస్థితి మెరుగుపడిందనేది వాస్తవం. అయితే, టి–20, వన్డే ఫార్మేట్లలో ప్రపంచ కప్‌లో కానీ, ఐసిసి అంతర్జాతీయ టోర్నీల్లో కానీ భారత్‌ను విజేతగా నిలపడంలో అతడు విఫలమయ్యాడు. టెస్టు జట్టు కెప్టెన్సీ నుంచి తప్పుకోవాలని ఇంత హఠాత్తుగా నిర్ణయం తీసుకోవడానికి దారితీసిన పరిస్థితులేమిటన్నది ఇదమిత్థంగా తెలియరాలేదు. కెప్టెన్‌గా పెరుగుతున్న ఒత్తిడి వల్ల బ్యాటింగ్‌పై దృష్టి పెట్టలేకపోతున్నానని, అందుకే తప్పుకుంటున్నానని అతడు ఇచ్చిన వివరణ విశ్వసించేదిగా లేదు. టి–20 జట్టు కెప్టెన్సీ బాధ్యతల నుంచి కోహ్లీని తప్పించినప్పుడు అతనికి, బిసిసిఐకి మధ్య సంబంధాలు సవ్యంగా లేవన్న సంకేతాలు వచ్చాయి. కోహ్లీకి నచ్చజెప్పడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయిందని బిసిసిఐ చీఫ్ గంగూలీ చేసిన వ్యాఖ్యలతో కోహ్లీ బాహాటంగానే విభేదించాడు. ఆ తరువాత కూడా ఈ విభేదాలను పరిష్కరించేందుకు బిసిసిఐ నుంచి ఎలాంటి ప్రయత్నం జరిగిన దాఖలాలు లేవు. ఆటగాళ్ల ఎంపికలో కెప్టెన్ అభిప్రాయాలకు బిసిసిఐ విలువ ఇవ్వలేదన్న విమర్శలూ వినిపించాయి. బిసిసిఐ ప్రధాన కార్యదర్శిగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పుత్రరత్నం జైషా వచ్చాక పరిస్థితి మరింత దిగజారింది. గత ఏడాది టి–20 ప్రపంచ కప్‌లో పాకిస్తాన్ చేతిలో భారత్ ఓటమిపాలైనప్పుడు పేసర్ మహ్మద్ షమీ పాకిస్తాన్‌కు అమ్ముడుపోయాడంటూ విద్వేషకులు కొందరు ఆయనపై విషం కక్కినప్పుడు కోహ్లీ ఏమాత్రం తటపటాయించకుండా తన జట్టు సహచరుడికి బాసటగా నిలిచాడు.



# కోటప్పకొండ తిరుణాళ్ల ఏర్పాట్లపై తొలి సమన్వయ సమావేశం..

## వచ్చే నెల 25 నాటికి పనులు పూర్తయ్యేలా ప్రణాళికలు

నరసరావుపేట. ప్రజాపాలన : మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండలో జరగనున్న శ్రీ తికోటేశ్వర స్వామి వారి తిరుణాళ్లపై తొలి సమన్వయ సమావేశం కోటప్పకొండ స్వామి దేవస్థాన ప్రాంగణంలో నిర్వహించారు. శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి , జేసీ దినేష్ కుమార్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. ముఖ్యంగా తిరుణాళ్ల సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, కొవిడ్ నిబంధనలు పాటిస్తూ స్వామి వారి దర్శనానికి వచ్చిన ప్రతి ఒక్కరూ వీలైనంత త్వరగా దర్శనం చేసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. క్యూ లైన్లలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా గతేడాది ఉత్పన్నమైన సమస్యలు పునరావృతం కాకుండా చర్యలకు ఆదేశించారు. పండుగ రోజు శానిటేషన్ విషయంలో రాజీపడకుండా వీలైనంత ఎక్కువ సిబ్బందిని ఏర్పాటు చేసి చెత్తా చెదారం ఎక్కువ ఉండకుండా చూడాలన్నారు. నరసరావుపేట పట్టణంతో పాటు కొండ పైన, కింద పరిశుభ్రంగా ఉండాలని ఆదేశించారు. భక్తులకు మంచినీరు, మజ్జిగ ప్యాకెట్ల సరఫరా ఎప్పటికప్పుడు జరిగేలా వీఆర్ఓలు, పంచాయతీ సెక్రటరీల సేవలు వినియోగించుకోవాలని సమావేశంలో నిర్ణయించారు.

భద్రతా ఏర్పాట్లతో పాటు, ట్రాఫిక్, క్రౌడ్ మేనేజ్ మెంట్ పై సమావేశంలో చర్చించారు. 2 వేల మంది పోలీసులతో పాటు, ట్రాఫిక్ రూట్ మ్యాప్, పార్కింగ్, సీసీ కెమెరాల ఏర్పాటు పై చర్చించారు. కొటప్పకొండకు తాకిడి ఎక్కువగా ఉండే చిలకలూరిపేట, వినుకొండ రోడ్డు, నరసరావుపేట నుంచి కోటప్పకొండ వెళ్లే మార్గాల్లో రోడ్డు పనులతో పాటు, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ పనులు త్వరతిగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ ఎప్పటికప్పుడు దారి మళ్లించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.లి

కోవిడ్ కేసులు ఎక్కువ అవుతున్న తరుణంలో భక్తులు మాస్కులు తప్పనిసరిగా ధరించాలని సూచించారు. మాస్క్ లేకుండా దర్శనానికి అనుమతించేది లేదన్నారు. అలాగే కోవిడ్ టెస్టింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి లక్షణాలు ఉన్న వారి టెస్టులు చేయించుకునేలా చూడాలని, పాజిటివ్ వస్తే కొండ పైనే ఐసోలేషన్ కేంద్రాల్లో ఉంచాలే చూడాలని సమావేశంలో నిర్ణయించారు.

తిరుణాళ్ల నేపథ్యంలో నరసరావుపేట అర్బన్ తో పాటు కొండ వరకు లైటింగ్, మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, బ్రహ్మోత్సవాల సమయంలో తిరుపతి మాడ వీధుల్లా కొటప్పకొండ పరిసరప్రాంతాలు ఉండాలని సమావేశంలో నిర్ణయించారు.

తిరుణాళ్లకు వచ్చె భక్తులకు ఇబ్బంది కలగకుండా గతంలో మాదిరిగానే ఈ సారి కూడా ఆర్టీసీ కీలక పాత్ర పోషించాలన్నారు. చిలకలూరిపేట, నరసరావుపేట, వినుకొండ డీపో బస్సులతో పాటు గుంటూరు నుంచి కూడా వీలైనన్ని సర్వీసులు నడపడంతో పాటు వాటి పార్కింగ్, ఎక్కడయినా బస్సులు బ్రెక్ డౌన్ అయితే వెంటనే స్పందిచే మెకానికల్ టీంను సిద్ధం చేయాలన్నారు.లి

తిరుణాళ్లలో ఆకతాయిలు, దొంగల ఆటకట్టించడానికి వీలుగా నూతనంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా ప్రవేశపెట్టిన దిశ పోలీస్ స్టేషన్ ఏర్పాటు, మహిళా పోలీసింగ్ సేవలు వినియోగించుకోవాలని నిర్ణయించారు. నిర్దేశించుకున్న పనులు త్వరతిగతిన పూర్తి కావాడానికి కావాల్సిన నిధులు కలెక్టర్ , జెడ్పీ సీఈవో మంజూరు చేయాలని కోరారు.లి

అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే ఎంతో పేరు ప్రఖ్యాతలున్న కోటప్పకొండ తిరుణాళ్ల మరికొద్ది రోజుల్లో రానున్న తరుణంలో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసి అన్ని శాఖల సమన్వయంతో తిరుణాళ్ల పనులు త్వరతగతిన పూర్తి చేసుకోవాలని నిర్ణయించుకోవడం జరిగిందన్నారు. 10 లక్షల మంది వచ్చే తిరుణాళ్లకు కావాల్సిన ఏర్పాట్లు, స్వామి వారిని దర్శించుకోవడానికి వచ్చే 2 లక్షల మందికి పైగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు వాటిల్లకుండా ముందుకు వెళ్తామన్నారు. కోవిడ్ మహమ్మారి మరోసారి తన ప్రతాపం చూపిస్తున్నా ప్రస్తుతం ఉన్న వేవ్ వల్ల ప్రాణనష్టం జరగదని,ఒకవేళ పాజిటివ్ వచ్చినా ఐదు, ఆరు రోజుల్లో తగ్గిపోతుందన్నారు. ప్రజలు జాగ్రత్తగా ఉంటూ మాస్కులు ధరించి స్వామి వారి దర్శనానికి రావాలని విజప్తి చేశారు. అన్ని శాఖల సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండా పాజిటివ్ వచ్చినా పనులు ఆగకుండా ప్రత్యామ్నయ మార్గాల ద్వారా ముందుకు వేయాలని కోరారు.లి

జేసీ దినేష్ కుమార్ మాట్లాడుతూ.. తిరుణాళ్లకు సంబంధించి తొలి సమన్వయ సమావేశానికి సంబందించి నిర్ణయించుకున్న పనులను వచ్చే నెల 18 లోపు పూర్తి చేసేలా ముందుకు సాగుతామన్నారు. 18వ తారీఖును రెండో సమావేశం కలెక్టర్ నేతృత్వంలో ఏర్పాటు చేసి తిరుణాళ్ల ఏర్పాట్లు పూర్తిపై చర్చిస్తామన్నారు. ముడో సమావేశం 25 తారీఖున ఏర్పాటు చేసి పండుగకు ఐదు రోజుల ముందు నుంచి భక్తుల తాకిడిని అంచనా వేసి సిబ్బంది అంతా తమ విధుల్లో చేరాలా చూస్తామని అన్నారు. ముఖ్యంగా ఆలయ ఆలంకరణ, భక్తుల రద్దీ, భద్రతా, ట్రాఫిక్ సమస్యపైనే పత్యేక ప్రణాళికలతో ముందుకు వెళ్తామన్నారు.

కార్యక్రమంలో ఆలయ ఈవో రామ కోటిరెడ్డి , ధర్మకర్త కొండల్ రావు, జెడ్పీటీసీ చిట్టిబాబు , ఎంపీపీ మూరబోయిన శ్రీనివాస రావు , కొండకావూరు సర్పంచ్ నాగిరెడ్డి , జెడ్పీ సీఈవో గజ్జల శ్రీనివాసరెడ్డి జేసీ 2 , ఆర్డీవో శేషారెడ్డి , ఎమ్మార్వో రమణా నాయక్ , ఆర్డీవో పరంధామ రెడ్డి , డీఎంహెచ్ ఓ అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఐరన్ టాబ్లెట్లు పంపిణీ,

### మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన ప్రధాన ఉపాధ్యాయులు జి.వి రమణ రావు



చిలకలూరిపేట: (ప్రజా పాలన)పట్టణంలోని భారతరత్న ఇందిరా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పర్యవేక్షించి అదే విధంగా విద్యార్థులకు ఐరన్ టాబ్లెట్లు వైద్య సిబ్బంది ద్వారా పంపిణీ కార్యక్రమని ప్రధానోపాధ్యాయులు జి.వి రమణారావు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణకి కొన్ని సూచనలు చేశారు. అందరూ కోవిడ్ జాగ్రత్తలు పాటించాలన్నారు. భోజనానికి ముందు చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని చెప్పారు. ఐరన్ లోపం లేకుండా ఉండాలంటే పాలు,ఆకుకూరలు,కాయగూరలు తప్పక తీసుకోవాలన్నారు. విద్యార్థులు ఐరన్ లోపంతో బాధపడకూడదని, రాష్ట్ర ప్రభుత్వం అన్ని పాఠశాలల విద్యార్థులకు ప్రతి సంవత్సరం రెండుసార్లు ఐరన్ టాబ్లెట్లు పంపిణీ చేస్తుందన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహమ్మద్ ఆలీ,డీ.వి.కృష్ణ బాబు పి.ఈ.టిఅమీర్ హుస్సేన్,తోపాటు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జ్యుడిషియల్ ఉద్యోగుల నిరసన



నరసరావుపేట. ప్రజాపాలన : జ్యుడీషియల్ ఉద్యోగులు నిరసన తెలిపారు. శుక్రవారం నరసరావుపేట కోర్టులో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జి.ఓ. నె:1,2,8 లను రద్దుచేయాలని,పిఆర్ సి 2020 ని కాపాడాలని నరసరావుపేట జ్యుడిషియల్ ఉద్యోగులు నల్ల బాడ్జీ లతో నిరసన తెలిపినారు .ఈ కార్యక్రమంలో షేక్ బాజిబాబా, తుబాటి శ్రీనివాసరావు, పి.రవి,కె.కిషోర్, పి.రామ్ గోపాల్, ఇంకా జ్యుడిషియల్ ఉద్యోగులు పాల్గొనినారు.

## ఇంటింటికి రేషన్ పంపిణి వాహనాలను ప్రారంభించి ఏడాది పూర్తి



నరసరావుపేట : ఇంటింటికి రేషన్ పంపిణి వాహనాలను ప్రారంభించి ఏడాది పూర్తి... కేక్ కట్ చేసిన శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి . ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇంటింటికి రేషన్ పంపిణి పథకంలో భాగంగా.. వాహనాలు ప్రారంభించి ఏడాది పూర్తైన సంధర్భంగా.. నరసరావుపేట పట్టణంలోని 60 అడుగుల రోడ్డులో గల పార్టీ కార్యాలయంలో శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి దివంగత మహానేత వైయస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదగా కేక్ కటింగ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

## నేతాజీ సేవాసమితి నూతన అధ్యక్షునిగా చుండూరి.కృష్ణమూర్తి



చీరాల(ఒంగోలు): నేతాజీసేవాసమితి సర్వసభ్యసమావేశంలో, నూతనఅధ్యక్షుడిగా చుండూరి.కృష్ణమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక బాలాజీ గోల్డ్ కాంప్లెక్స్ కార్యాలయంలో జరిగిన సమితి సమావేశంలో, కృష్ణమూర్తి ని అధ్యక్షునిగా ఎన్నుకోవడంతో పాటు, మిగతా కార్యవర్గసభ్యుల కమిటీని ఎన్నుకునే పూర్తిఅధికారాన్ని అప్పగించి, కార్యవర్గ సమితి తమకు కృష్ణమూర్తి పట్ల ఉన్న నమ్మకాన్ని, గౌరవాన్ని తెలియజేశారు. ప్రస్తుత సమితి,బాడీకాలపరిమితి పూర్తయినందువలన,నూతనఅధ్యక్షుని ఎంపిక కార్యక్రమం జరిగింది.సమితి సభ్యులు మంకెన మణిబాబు, కె.రామారావు, సర్విశెట్టి సుబ్బరామయ్య, అన్నంరాజు.సుబ్బారావు, పి.సత్యనారాయణ, జివివి ప్రసాద్, పి.నాగమనోహర్లోహియా తదితరులు పాల్గొన్నారు.

## రివర్స్ పిఆర్సి జీవోలు ఉపసంహరించుకోవాలి

చీరాల(ఒంగోలు) : రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పిఆర్సి జీవోలు,తక్షణం ఉపసంహరించుకోవాలని,ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు పి.సత్యనారాయణ,జనరల్ సెక్రెటరీ డివిఎస్.పాల్,ట్రెజరర్ పి.మోహన్బాబు,జాయింట్ జనరల్ సెక్రటరీ చుండూరు కృష్ణమూర్తి లు డిమాండ్ చేశారు.ప్రభుత్వం రిటైర్డ్ అయిన ఉద్యోగస్తుల ఉసురు పోసుకోవద్దని విజ్ఞప్తి చేశారు.

## కరోనా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



భీమవరం, జనవరి 21 (ప్రజాపాలన ప్రతినిధి) : పెరుగుతున్న కరోనా కేసుల దృష్ట్యా పట్టణంలో కొవిడ్ కేర్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ తహసిల్దార్ ఏ.వి రమణరావును ఆదేశించారు. శుక్రవారం శాసనసభ్యులు తన నివాసంలో పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కరోనా వైరస్ పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వపరంగా కరోనాను అరికట్టేందుకు అన్ని విధాలుగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చర్యలు తీసుకున్నారని తెలిపారు. దీనిపై ఇప్పటికే భీమవరం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రెండు ఆక్సిజన్ ప్లాంట్లను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. అయితే వైరస్ సోకిన తర్వాత అనారోగ్య బారిన పడేకంటే ముందుగానే వైరస్ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు. గత రెండు సంవత్సరాలుగా రెండుసార్లు కరోనా ప్రభావం మానవ సమాజాన్ని అతలాకుతలం చేసిందని గుర్తుచేశారు. కరోనాతో చనిపోయిన వారికి దగ్గరుండి అంత్యక్రియలు జరపలేని పరిస్థితిలో చివరకు కడసారి చూపుకూడా లేని దుస్థితిని ఎదుర్కోవడం జరిగిందని అన్నారు. ఇవన్నీ ప్రజలు, వ్యాపారులు దృష్టిలో పెట్టుకుని కరోనా థర్డ్ వేవ్ నుండి బయటపడటానికిగాను కరోనా నిబంధనలను కచ్చితంగా ఎవరికివారు బాధ్యతగా తీసుకొని పాటించాలని కోరారు. భీమవరం నియోజకవర్గం లో కరోనా కేసులు పెరగకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవడం జరిగిందని అన్నారు. అయినప్పటికీ పట్టణంలో కోవిడ్ కేర్ సెంటరును ఏర్పాటు చేయడం వల్ల మరింతగా కరోనాను నియంత్రించేదిశగా చర్యలు తీసుకోవడం జరిగిందని అన్నారు. దగ్గు ,జలుబు, జ్వరం, గొంతునొప్పి, ఒంటి నొప్పులు లాంటి లక్షణాలు కలిగిన వారు ఆలస్యం చేయకుండా కరోనా పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. పట్టణానికి దీర్ఘకాలిక సమస్యగా ఉన్న కంపోస్ట్ యార్డు సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని దీనికి సంబంధించి కసరత్తు పూర్తిచేయడం జరిగిందని శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ అన్నారు. జగనన్న స్మార్ట్ గృహాలకు సంబంధించి భూమిని కూడా సేకరిస్తామని తెలిపారు .ఈ సమీక్ష లో డిప్యూటీ తహసిల్దారు గ్రంధి పవన్ పాల్గొన్నారు.

## ప్రజలు కోవిడ్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి: శాసన సభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



నరసరావుపేట. ప్రజాపాలన : ప్రజలు కోవిడ్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కరోన మూడో వేవ్ త్వరగా వ్యాప్తి చెందుతుందని, మూడో వేవ్ వల్ల ప్రాణాలకు ఎలాంటి హాని ఉండదని అన్నారు. నరసరావుపేట లో స్థానిక లింగం గుంట్ల వద్ద గల ఏరియా హాస్పిటలను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఎవరికైనా కోవిడ్, ఒమైక్రోన్ లక్షణాలు ఉంటే వెంటనే హాస్పిటల్ కి వెళ్లాలి.. ఆర్.టి.ప్.సి.ఆర్ టెస్టులు కోసం గతం లో ఇక్కడి నుండి గుంటూరు కి వేలాల్సి వచ్చేది.ప్రస్తుతం ఆ టెస్టులు కూడా ఇక్కడే చేస్తున్నామని తెలిపారు. ముందస్తు చర్యలో భాగంగా హాస్పిటల్ లో ఆక్సీజెన్ కూడా నిల్వ చేస్తున్నాము. ప్రజలు కూడా తప్పనిసరిగా మాస్క్,సానిటీజర్ వాడాలి. మాస్క్ లేకుండా ఎవరు బయటికి రావద్దని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కోవిడ్ పై ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉందని తెలిపారు.

## ఆసుపత్రి నిర్మాణానికి రూ. 4 కోట్ల విలువైన భూమి దానం.. దాతను సత్కరించిన చందన నాగేశ్వర్



రాజమహేంద్రవరం రూరల్ ప్రజా పాలన ప్రతినిధి : తన గ్రామంలో ప్రభుత్వ ఆసుపత్రి ఉండాలనే ఉద్దేశంతో రూ.4 కోట్ల విలువైన భూమిని దానం చేసిన వృద్ధురాలును రాజమహేంద్రవరం స్మార్టుసిటీ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి రూరల్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ శుక్రవారం సత్కరించారు.కడియం మండలం కడియపులంక గ్రామానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పి హెచ్ సి) మంజూరైంది.అయితే నర్సరీ రంగం విస్తరించి ఉన్న ఈ ప్రాంతంలో భూసేకరణ కష్టంగా మారింది. వేరే గ్రామానికి ఈ ఆసుపత్రి వెళ్లిపోతున్నట్లు కుటుంబ సభ్యుల ద్వారా తెలుసుకున్న దివంగత అన్నందేవుల సర్వేశ్వరరావు సతీమణి రామ సూర్య సీతామాలక్ష్మి (బాస్కరమ్మ) తన తల్లిదండ్రులు ఈలి పాపారావు, అమ్మారావు జ్ఞాపకార్థం దాదాపు రూ. 4 కోట్ల విలువైన 80 సెంట్లు భూమిని విరాళంగా అందించారు...కడియపులంక నర్సరీ అసోసియేషన్ కార్యాలయం సమీపంలో అందరికీ అనువైన తూర్పు, ఉత్తరం రోడ్డు కలిగిన భూమి ఇవ్వడంతో అందులో మూడు కోట్ల రూపాయల వ్యయంతో ప్రభుత్వం భవనాలు నిర్మిస్తుంది.ప్రజల ఆరోగ్యానికి ఇంత విలువైన భూమిని దానం చేసిన బాస్కరమ్మను చందన నాగేశ్వరావు తో పాటు అధికారులు, వైఎస్ఆర్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. తొలుత ఆస్పత్రికి కేటాయించిన భూమిని వారి కుటుంబ సభ్యులతో పాటు తిలకించారు. ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న ఆ మాటను నిజం చేశారని, అన్నందేవుల సీత మహా లక్ష్మీ స్వగృహానికి వెళ్ళి పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. భూముల విలువలు విపరీతంగా పెరిగినప్పటికీ దాతృత్వం చాటుకోవడం చాలా ఆనందంగా ఉందని.ఈ సందర్భంగా చందన నాగేశ్వర్ కొనియాడారు. భాస్కరమ్మతో పాటు వారి కుటుంబ సభ్యులు అన్నందేవుల గంగాధరరావు, పార్వతి,దినేష్ పాపారావు,అన్నందేవుల వెంకట కృష్ణ,హరినాధరావు తదితరులను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా భాస్కరమ్మ, కుటుంబ సభ్యులు మాట్లాడుతూ మండల ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండేందుకు భుమి దానం చేసామని త్వరితగతిన ఈ ఆసుపత్రి నిర్మాణాన్ని పూర్తి చేయాలని చందన నాగేశ్వర్ ను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె. రత్న కుమారి, ఎమ్మార్వో కె. సుజాత, పంచాయతీ కార్యదర్శి బి. శిరీష, కడియం మండల అధ్యక్షులు స్టాలిన్, రాష్ట్ర కార్యదర్సులు రావిపాటి రామచంద్రరావు మరియు గిరజాల బాబు, కడియపులంక త్రిసభ్య కమిటీ సభ్యులు తిరుములశెట్టి శ్రీను, వార రాము, ఎంపీటీసీ అన్నందేవుల దుర్గరావు, బోడపాటి సత్తిబాబు, అరేటి వెంకట్రావు, చీకట్ల మాచరయ్య, నాగిరెడ్డి రామకృష్ణ,గాధ రామకృష్ణ, కొత్తపల్లి శివాజీ,ముత్యం జగదీష్, అయ్యప్ప, అడ్డగెళ్ళ రమేష్, తాడల రఘు,బోడపాటి మూర్తి, పంతం తాతాజీ పెనుమాక వెంకన్నతదితరులు పాల్గొన్నారు....

## విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ

చందోలు(పిట్టలవాని పాలెం)ప్రజాపాలన:విద్యార్థులకు దాతలు చేస్తున్న సహకారం అభినందనీయమని రెడ్ల బజార్ మండల పరిషత్ ప్రాథమిక



పాఠశాల ఉపాధ్యాయులు షమిం సుల్తానా అన్నారు. పిట్టలవానిపాలెం మండల పరిధిలోని చందోలు పంచాయతీ శివారు రెడ్ల బజార్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం దాత, కో అపేటెడ్ సభ్యుడు పొదిల సుబ్బారావు విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు షమిం సుల్తానా మాట్లాడుతూ గతంలో కూడా పాఠశాలలో విద్యార్థులకు సహాయ సహకారాలు అందించారని గుర్తు చేశారు.దాత చేస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.దాత, కో అపేటెడ్ సభ్యుడు సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు.ఇలాగే పాఠశాల విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తానని తెలియజేశారు.

## నరేంద్ర ఫార్మసీ వారిచే గ్లూకోస్ ప్యాకెట్ పంపిణీ



పొన్నూరు జనవరి21 (ప్రజా పాలన ప్రతినిధి) :స్థానిక పొన్నూరు బ్లడ్ డోనర్స్, నరేంద్ర ఫార్మసీ ఆధ్వర్యంలో శుక్రవారం కసుకర్రు రోడ్డులోని అమ్మ సేవా నిలయంలో గ్లూకోజ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. పొన్నూరు బ్లడ్ డోనర్స్ సభ్యుడు తిరుమలశెట్టి ఉమాశంకర్ మాట్లాడుతూ కరోనా సమయాల్లో వృద్ధులకు శక్తి ఇచ్చేందుకు తమ వంతు గా గ్లూకోజ్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. పంపిణీ చేసిన సభ్యులకు అమ్మ సేవా నిలయం వృద్ధులు, సేవా నిలయం నిర్వాహకుడు స్వామి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడివాడ పవన్, హేమంత్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## గుడివాడలో తీవ్ర ఉద్రిక్తత



గుడివాడ : కృష్ణాజిల్లా గుడివాడ నియోజకవర్గం మన సంక్రాంతి సందర్భంగా జరిగిన కే కన్వెన్షన్ హాల్లో క్యాషియో గురించి జరిగినా దానికి టిడిపి రాష్ట్ర పార్టీ ఏదైతే వేసిందో నిజ నిర్ధారణ కమిటీ తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది టిడిపి వైసిపి కార్యాలయాల వద్ద వారి వారి కార్యకర్తలతో భారీగా మోహరించిన దం జరిగింది వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి మండలి హనుమంతరావు వైసిపి కార్యకర్తలతో నాగవరప్పాడు దగ్గర రోడ్డుపై బైఠాయించి పొరుగూరు నుంచి ఇక్కడకు వచ్చి నిజనిర్ధారణ చేసేది ఏంటి రోడ్డుపై బైఠాయించి ఉద్రిక్తతలకు దారి తీయటం ఇక్కడ ఏదైనా జరిగితే స్థానిక మంత్రి బాధ్యత అవుతుంది కాబట్టి అంటూ పోలీసులతో వాగ్వివాదానికి దిగడం జరిగింది పోలీసు వారు నచ్చచెప్పి ఉద్రిక్తతలు దారితీయకుండా సహకరించాలని కోరడంతో ఆయన వారికి సహకరించడం జరిగింది కార్యకర్తలు తీసుకొని వెళ్లిపోవడం జరిగింది..

## పాఠశాల నిర్వహణ పై సంతృప్తి: పులపాక ప్రసన్న లక్ష్మి



గన్నవరం, ప్రజాపాలన ప్రతినిధి జనవరి21: ఉంగుటూరు మండలం, అత్కూరు గ్రామ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల , జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు శ్రీమతి పులపాక ప్రసన్న లక్ష్మి వారు, అత్కూరు -1 మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం సభ్యులు శ్రీమతి ఆర్నేపల్లి శివ లక్ష్మి , మరియు అత్కూరు -2 మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం సభ్యులు శ్రీమతి సోంగా మేరి వారితో కలిసి సందర్శించడమైనది. సదరు పాఠశాలు యందు విద్యార్థులకు కల్పించిన మౌలిక సదుపాయాలు ఉపాధ్యాయులు పని తీరు మధ్యాహ్నం భోజనం ఏర్పాట్లు అన్ని ప్రధానోపాధ్యాయులు వారిని అడిగి తెలుసుకొని పాఠశాల నిర్వహణ పై సంతృప్తి చెందడమైనది అని తెలియజేశారు.

# ఆపన్నులకు అండగా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సేవాకార్యక్రమాలు

చీరాల(ఒంగోలు) :సంఘాలు ఎన్ని ఉన్నా, నిస్వార్థంగా సామాజిక సేవాకార్యక్రమాలు చేసేవి.. కొన్ని మాత్రమే. అటువంటి కోవకే చెందిన సంస్థ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా.., ఆస్తులే ఉండక్కర్లేదు. పదిమందికి మంచిచేయాలనే మంచి మనసు ఉంటే చాలు అని, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సౌత్ ఇండియా రీజియన్ చైర్మన్, షేక్ ఖలీఫాతుల్లా భాషా నిరూపించారు. పదిమందికి మంచి చేయాలనే ఖలీఫాతుల్లా భాషా తపనను గుర్తించిన, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సౌత్ ఇండియా రీజియన్ వర్కింగ్ చైర్మన్ మరియు కోవిద హృదయ ఫౌండేషన్ చైర్మన్, డాక్టర్ డి.అనూహ్యారెడ్డి, ఆర్థికచేయూత అందిస్తు, తమ సహృదయాన్ని చాటుకుంటున్నారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కోవిద హృదయ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో లెక్కలేనన్ని సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

– దుబాయ్ లో ఇరుక్కుపోయిన, మహిళలను స్వదేశానికి తీసుకువచ్చి..,

నకిలీ ఏజెంట్ మాటలు నమ్మి, దుబాయ్ లో ఇరుక్కుపోయిన, సుమారు 50 మందికి పైగా మహిళలను స్వదేశానికి తీసుకువచ్చి, వారివారి ఇళ్లకు చేర్చటంతోపాటు, వారికి ఆర్థికచేయూత అందించి, తమ సహృదయాన్ని చాటుకున్నారు. కోవిడ్ సమయంలో అందించిన సేవలు హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గొప్పతనాన్ని, కోవిద హృదయ ఫౌండేషన్ సహృదయాన్ని చాటి చెప్పాయి.

– పండగలు చేసుకోలేని పేదవారి ఇళ్లల్లో వెలుగులు

సర్వమత సామరస్యతను చాటుతూ హిందూ, ముస్లిం, క్రైస్తవ తదితర అన్నిమతాల వారి పర్వదినాలను నిర్వహిస్తూ, పండగలు చేసుకోలేని పేదవారి ఇళ్లల్లో, వెలుగులు నింపుతున్నారు. కష్టం వస్తే చాలా అండగా ఉంటామన్న అభయాన్ని అందజేస్తూ, రాజకీయాలకతీతంగా, అన్ని వర్గాల ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్నారు. అంతేకాకుండా జాతీయ నాయకుల జయంతి, వర్ధంతి వేడుకలను, పండుగలా జరుపుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు.వీరి సామాజిక సేవలు ఇలానే కొనసాగాలని ఆశిద్దాం.

– లెక్కలేనన్ని సామాజిక సేవా కార్యక్రమాలు

సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా అన్నదానం, వస్త్రదానం, వికలాంగులకు ట్రై సైకిళ్ల పంపిణి, పేదలైన రోగులకు మందులు పంపిణీ, నిత్యావసర వస్తువుల పంపిణీ, పేదలైన మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు కుట్టుమిషన్లు, ఉపాధి శిక్షణ కార్యక్రమాలు తదితర లెక్కలేనన్ని సేవలు చేస్తూ అందరి అభిమానాన్ని చూర గొంటున్నారు.

– నిరాడంబరతకు నిదర్శనం.

సామాజిక సేవా కార్యక్రమాల విషయమై అడిగితే,ఏమాత్రం అహంభావం ప్రదర్శించకుండా కేవలం కోవిదహృదయ ఫౌండేషన్ సహకారం అందిస్తుండటంవలననే సామాజికసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సౌత్ ఇండియా రీజియన్ చైర్మన్ షేక్ ఖలీఫాతుల్లా భాషా పేర్కొనటం, ఆయనలోని నిరాడంబరతకు నిదర్శనం.

**సామాజికసేవాకార్యక్రమాల్లో ముందుంటున్న హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా**

**చేయూతను అందిస్తున్న కోవిద సహృదయ ఫౌండేషన్**

**మానవ హక్కుల సంరక్షణయే, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా లక్ష్యం**






## ఘనంగా గానాల రామ్మూర్తి జయంతి వేడుకలు



చీరాల(ఒంగోలు) : దక్షిణాదిరాష్ట్రాలలో మొట్టమొదటిగా ప్రకాశం జిల్లా, చీరాలలో ప్రతిష్ఠించిన బ్రహ్మశ్రీ గానాల రామ్మూర్తి విగ్రహం వద్ద వారి 130వ జయంతి వేడుకలను, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ/విశ్వకర్మ ఉద్యోగస్తుల సంక్షేమ సంఘం మరియు చీరాల - పేరాల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ, గానాల రామ్మూర్తి సేవలను గుర్తు చేసుకున్నారు.కార్యక్రమంలో బ్రహ్మశ్రీ గొర్రెపాటి ప్రభాకర్ విశ్వకర్మ, బ్రహ్మశ్రీ కడలి జగదీష్ కుమార్, ఇంకొల్లు వీరభద్రుడు, ఆదిమూలం ప్రభాకర రావు, ఇంకొల్లు మోహనరావు, మణికేశ్వరం మధుసూధనరావు ,ఇంకొల్లు హేమసుందర్, కడలి ఏకాంబరం, బర్నికల నాగేశ్వరరావు , ఫణిదపు శివాంజనేయ ప్రసాద్, గుంటముక్కల బ్రహ్మం, ముదపాక విశ్వనాధచారి, వెల్లంకి కృష్ణమూర్తి, ఆరేపాక మోహన్, ఆరేపాక వంశి, వంగిపురపు తిరుమలేశ్వర రావు, రామోజు రమణ, సిద్ది శ్రీను, రావూరి నారాయణమూర్తి, కొణికి శేషగిరి, కాకుమాను పూర్ణచంద్రరావు, ఓలేటి రవిచంద్ర, మంగళగిరి పిచ్చయ్యచారి,దార్ల వరప్రసాద్, కొండూరి శ్రీనుస్వామి, పూండ్ల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు, లోకేశ్ బాబు త్వరగా కోలుకుని ఆరోగ్యంగా ప్రజలలోకి రావాలని పూజలు: వల్లెపు నాగేశ్వరావు



నరసరావుపేట. ప్రజాపాలన : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వారి తనయుడు మాజీ మంత్రి నారా లోకేష్ బాబు కోవిడ్ లక్షణాలతో హెూమ్ ఐసోలేషన్ లో ఉన్నందున వారు త్వరగా కోలుకుని ఆరోగ్యంగా ప్రజలలోకి రావాలని రాష్ట్రానికి వారి నాయకత్వం ఎంతో అవసరమని.కరోన మహమ్మారి నుండి కోలుకుని ప్రజల సమస్యలపై పోరాడాలని. శుక్రవారం నరసరావుపేట పురపాలక సంఘం కార్యాలయంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి గుడిలో అఖిల భారత వడ్డెర సక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు,తెలుగుదేశం పార్టీ మానవ వనరుల అభివృద్ధి విభాగం రాష్ట్ర సభ్యులు వల్లెపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొని కొబ్బరి కాయలు కొట్టి దేవుణ్ణి ప్రార్థించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వల్లెపు నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో వడ్డెర కమ్యూనిటీ ముప్పై లక్షల మంది పైన ఉన్నారని ఇంతవరకు శాసన సభలో ఒక్కరు కూడా లేరని వడ్డెర్ల కు నాలుగు ఎమ్మెల్యే లు, రెండు ఎమ్మెల్సీలు, ఒక ఎంపీని రాష్ట్ర తెలుగుదేశం పార్టీలో వడ్డెర్లకు ప్రాధాన్యత కల్పించాలని తనకు ఇంచార్జ్ గా గాని, ఎమ్మెల్యే అభ్యర్థి గా టికెట్ ఇవ్వాలని లేదా రాష్ట్రంలో నూట డేబై ఐదు నియోజకవర్గలలో ఎక్కడైనా సరే తనకు అవకాశం కల్పించాలని తెలిపారు అదేవిదంగా రాష్ట్ర ప్రభుత్వ తీరుతో నష్టపోయిన ఉద్యోగులు చేస్తున్న పోరాటాలకు తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. సిపి.ఎస్.రద్దు చేస్తామని.పీ.ఆర్.సి.సకాలంలో ఇస్తామని.ఇచ్చిన హామీలను అమలు చేయడంలో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం ఉద్యోగులకు 43 శాతం ఫిట్ మెంట్ ఇచ్చిన ఘనత తెలుగుదేశం పార్టీకె దక్కిందన్నారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం విడుదల చేసిన జీవోలను తక్షణం ఉపసంహరించుకుని ఉద్యోగ,ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వల్లెపు డిమెండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వడ్డెర నాయకులు చేపూరి ఏడుకొండలు,దాసపల్లి గురువులు,చంద్రగిరి పెద్దిరాజు,వేముల దావీదు,తమ్మిశెట్టి ప్రసాద్,వల్లెపు యేసు,ఆవులు చంద్రం, వేముల.రామకృష్ణ, జాయింట్ సెక్రెటరీ వేముల సాయిరాం,గుంజ కొండ తదితరులు పాల్గొన్నారు

## సచివాలయ సిబ్బందికి యూనిఫామ్ పంపిణీ



పొన్నూరు జనవరి21 (ప్రజాపాలన ప్రతినిధి) :మండల పరిధి మామిడి పల్లి గ్రామం లోని సచివాలయంలో గురువారం సచివాలయ సిబ్బందికి యూనిఫారంలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జాలాది యానాది రావు పాల్గొని పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సచివాలయ వ్యవస్థలో పనిచేస్తున్న సిబ్బంది కి గుర్తుగా ప్రభుత్వం యూనిఫారంలు అందజేయటం హర్షణీయమని పేర్కొన్నారు.ఆయా శాఖల సిబ్బంది తో పాటు మహిళ పోలీసులకు కూడా యూనిఫామ్ అందజేయటం ప్రభుత్వ పారదర్శకతకు నిదర్శనమని అన్నారు. సచివాలయ వ్యవస్థకు సిబ్బంది కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కరీముల్లా సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ



చందోలు(పిట్టలవాని పాలెం)ప్రజాపాలన:విద్యార్థులకు దాతలు చేస్తున్న సహకారం అభినందనీయమని రెడ్ల బజార్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు షమిం సుల్తానా అన్నారు. పిట్టలవానిపాలెం మండల పరిధిలోని చందోలు పంచాయతీ శివారు రెడ్ల బజార్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం దాత, కో అపేటెడ్ సభ్యుడు పొదిల సుబ్బారావు విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు షమిం సుల్తానా మాట్లాడుతూ గతంలో కూడా పాఠశాలలో విద్యార్థులకు సహాయ సహకారాలు అందించారని గుర్తు చేశారు.దాత చేస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.దాత, కో అపేటెడ్ సభ్యుడు సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు.ఇలాగే పాఠశాల విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తానని తెలియజేశారు.

# మార్గాని ఎస్టేట్స్, రాజమండ్రి ఎంపీ కార్యాలయం నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రాజన్న రచ్చబండ కు వినతుల వెల్లువ

రాజమహేంద్రవరం ప్రజా పాలన ప్రతినిధి : స్థానిక ఎంపీ కార్యాలయం ఆవరణలో రాజన్న రచ్చబండ నిర్వహించిన రాజమండ్రి పార్లమెంట్ సభ్యులు, వైస్సార్సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్ మార్గాని భరత్. పార్లమెంట్ పరిధిలోని ప్రజలు తమ వినతులతో ఎంపీ గారిని కలవడం జరిగింది. వచ్చిన ప్రతీ ఒక్కరి సమస్యను విని అవి పరిష్కరించే విధముగా చర్యలు తీసుకోవడం జరిగింది. రాజమండ్రి అర్బన్ మరియు రూరల్ కల్లు గీత కార్మికులు వచ్చి తమకు కల్లు అమ్ముకునే వీలుగా స్థలం కేటాయించాలని కోరగా 2 స్థలాలు మంజూరు చేసే విధముగా కృషిచేస్తానని తెలిపారు. అంగవైకల్యం తో బాధపడుతున్న రాజమండ్రి 15 వ వార్డ్ పంపన వెంకట గోవిందమ్మా, రూరల్ కొంతమూరు గ్రామానికి చెందిన కొల్లి మెర్రి కుమారి లకు ప్రభుత్వం నుండి ట్రై సైకిల్స్ మంజూరు చేయించడం జరిగింది. త్వరలో వీరికి ఇవి అందచేయడం జరుగుతుంది అని ఎంపీ తెలిపారు.కొవ్వూరు నియోజకవర్గం కొవ్వూరు గ్రామం నుండి పిల్లా కృష్ణ కుమారుడు 6 సంవత్సరాల పిల్లా డోలా కృష్ణ గణిత విభాగంలో ఇండియా బుక్ అఫ్ రికార్డ్స్ లో స్థానం పొందడం ఆ ధ్రువీకరణ పత్రం మరియు పతకం ఎంపీ భరత్ ఆ బాలునికి అందచేయ్యడం జరిగింది. భవిష్యత్తులో గిన్నిస్ బుక్ అఫ్ వరల్డ్ రికార్డ్స్ లో ఈ బాలుడు స్థానం సంపాదిస్తాడు అని ఎంపీ భరత్ ఆకాక్షించారు.కోటిలో ఒకరికి వచ్చే రక్తహీనత వ్యాధితో బాధపడుతున్న రాజమండ్రి భారత బొమ్మలు వద్ద నివసించే తోట వైష్ణవి కి ఆరోగ్యశ్రీ ద్వారా మంచి వైద్యం అందే విధముగా %ఎవీటీట% నుండి కొంత మొత్తం వచ్చేవిధముగా ప్రయత్నించిన ఎంపీ భరత్.ప్రిన్సిపల్ అసిస్టెంట్ జడ్జి కమ్ చీఫ్ జ్యూడిషల్ మెట్రోపోలీటన్ మేజిస్ట్రేట్ రాజమండ్రి నియామకం పొందిన కోడి సతీష్ నాయుడు తన సహచర న్యాయ వాదులతో వచ్చి మర్యాద పూర్వకముగా ఎంపీ భరత్ ను కలవడం జరిగింది. తన నియామకంలో ఎంపీ గారు చూపించిన చొరవ తను జీవితంలో మరువలేనని, దానికి నేను ఎప్పుడు రుణ పడివుంటానని సతీష్ నాయుడు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఖాదీ బోర్డు వైస్ చైర్మన్ పిల్లి నిర్మల, డైరెక్టర్లు కానుబోయిన సాగర్, మార్తి లక్ష్మి, మాజీ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ చైర్మన్ బర్రె కొండబాబు, నగర బీసీ సెల్ చైర్మన్ మజ్జి అప్పా రావు, హితకారిని ట్రస్ట్ డైరెక్టర్లు ఉల్లూరి రాజు, దేవులపల్లి సరితా రాణి, వార్డ్ ఇంచార్జిలు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.



## డ్రైయినేజీ కాల్వల నిర్మాణ పనులు ప్రారంభం



గన్నవరం,ప్రజాపాలన ప్రతినిధి జనవరి21: బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్ నుంచి వేలేరు వెళ్లే రహదారి కొత్త కచ్చా డ్రైయినేజీ కాల్వల నిర్మాణ పనులు ప్రారంభించారు. బాపులపాడు పంచాయతీ ఆధ్వర్యంలో జరిగే ఈ పనులు సర్కిల్ ఇన్సిపెక్టర్ కార్యాలయం నుంచి సాగర కాల్వ దగ్గర వరకు కాల్వ తవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో కొమరవల్లి కిరణ్ , పాలక వర్గ సభ్యులు మత్తి ఉదయ శంకరం , ఇంజనీరింగ్ అసిస్టెంట్లు దుట్టా చంద్రశేఖర్ , మచ్చా దాలినాయుడు పలువురు స్థానికులు పాల్గొన్నారు.

## అక్రమ రేషన్ బియ్యం పట్టివేత



గన్నవరం,ప్రజాపాలన ప్రతినిధి జనవరి21: గన్నవరంలో విజయవాడ నుండి ఏలూరు వైపు వెళ్తున్న టాటా ఏ .సి.వాహనంలో అక్రమంగా 3 టన్నుల రేషన్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారంతో గన్నవరం ఎస్ ఐ. రమేష్ బాబు ఆధ్వర్యంలో తమ సిబ్బంది తో కలసి స్థానిక వెంకటేశ్వర థియోటర్ సమీపంలో జాతీయ రహదారిపై పట్టుకుని కేసునమోదు చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించారు..

## దోమల నివారణకు భారీ ఫాగింగ్



కావలి, జనవరి 21 ప్రజాపాలన ప్రతినిధి :కావలి లో దోమల నివారణకు భారీ గా ఫాగింగ్ కు శ్రీకారం చుట్టామని కమీషనర్ శివారెడ్డి తెలిపారు. విషజ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త గా దోమల నివారణకు పట్టణం అంతా ఫాగింగ్ చర్యలకు యుద్ద ప్రాతిపదికన నిర్వహిస్తున్న ట్లు తెలిపారు. పారిశుద్ధ్య మెరుగులో అప్రమత్తం కావాలని సిబ్బంది కి కమీషనర్ ప్రత్యేక ఆదేశాలు ఇచ్చామని ప్రజలు కూడా బాధ్యత గల పౌరులుగా తమ సిబ్బంది కి తమ వంతు సహకారం ఇవ్వాలని కోరారు. చెత్తను నిర్దేశించిన విధంగా వేయాలని పారిశుధ్యం కు వ్యతిరేకంగా ఎక్కడ పడితే అక్కడ వేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని శివా రెడ్డి తెలిపారు.

## శ్రీగోవిందమాల భక్తసమాజం ఆధ్వర్యంలో పేదలకు అన్నవితరణ



విజయవాడ,: పేదలకు పరోపకారం చేసే అన్నదాతల సేవలు చిరస్మరణీయమని శ్రీ గోవిందమాల భక్తసమాజం గోవిందగురు స్వామి ఏనుగుల వెంకట గాంధీబాబు కొనియాడారు. ఈ మేరకు శుక్రవారం గాంధీనగర్, రైల్వే స్టేషన్, వాంబే కాలనీ మాతృదేవో సంస్థ వృద్ధులకు కమిటీ సభ్యులు పుప్పాల అప్పారావు చేతుల మీదుగా పేదలకు అన్నవితరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ వెంటేశ్వరస్వామి వారి ఆశీస్సులతో, దాతల సహకారంతో గత సంవత్సరం కాలంగా 100మందికి పైగా పేదలకు, బాలలకు, వృద్ధులకు అన్నవితరణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. దాత పగడాల ముక్కంటి సతీమణి పగడాల శైలజ జ్ఞాపకార్థంతో అన్నవితరణ కార్యక్రమాన్ని నిర్వహించామని, పేదలకు పరోపకారం చేసే దాతలు నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో వర్థిల్లాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మాళవిక, దత్తిజ్యోతి, పబ్బతి కృష్ణా, గోపు శేషు, ఏనుగుల వెంకట శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ఓటిఎస్ ఎస్సి,ఎస్టీ లకు ఉచితంగా రిజిస్టేషన్‌లు చేయాలి: ధావులూరి



కావలి జనవరి 21 ప్రజాపాలన ప్రతినిధి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఓటిఎస్ పథకాన్ని ఎస్‌సి ఎస్‌టిలకు ఉచితంగా రిజిస్టేషన్‌లు చేసి వారిని ఆదుకోవాలని ఆలిండియా వెల్ఫేర్ ఎస్‌సి ఎస్‌టి అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దావులూరి శ్యామ్‌సన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటిఎస్ విధానం మంచి కార్యక్రమం అని దానిని అందరు సమ్మతించాలని ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో ఎస్‌సి ఎస్‌టిలు ఆర్థికంగా వెనుకబడి పేదరికంతో మగ్గుతున్నారని వారిని దృష్టిలో పెట్టుకొని ఓటిఎస్ విధానమైన ఉచిత రిజిస్టేషన్‌లను ఎస్‌సి ఎస్‌టిలకు మినహాయించాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓటిఎస్ పథకంపై ఎస్‌సి ఎస్‌టిలకు మినహాయింపు చేయాలని కోరారు. ప్రభుత్వ అధికారులు ఓటిఎస్ విధానంపై అందరిని ఒకగాటినే కట్టివేస్తున్నారని ఆ విధంగా కాకుండా నిరుపేదల్కైన ఎస్‌సి ఎస్‌టిలకు ఉచితంగా రిజిస్టేషన్‌లు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు.

# కే.కన్వెన్షన్లో జూదం, క్యాసినో జరిగిందని నిరూపిస్తే రాజకీయాలు వదిలేస్తా

## పెట్రోల్ పోసుకుని నిప్పు అంటించుకుంటా
## లేకుంటే చంద్రబాబు, లోకేష్ ఏం చేస్తారో చెప్పండి
## టీడీపీది అమ్మాయిలను అడ్డం పెట్టుకుని బతికే చరిత్ర
## పార్టీ, సీఎం పదవి, సైకిల్ గుర్తు ఎలా వచ్చాయో చెప్పండి
## రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కొడాలి నాని



గుడివాడ, ప్రజాపాలన ప్రతినిధి జనవరి 21: కృష్ణాజిల్లా గుడివాడ పట్టణం లింగవరం రోడ్డులో రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో కే. కన్వెన్షన్ ఉందని, సంక్రాంతి సందర్భంగా అక్కడ జూదం, క్యాసినో వంటివి జరిగాయని నిరూపిస్తే రాజకీయాలు వదిలేస్తానని, పెట్రోల్ పోసుకుని అంటించుకుంటానని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) సవాల్ విసిరారు. శుక్రవారం సెక్రటేరియేట్ దగ్గర మంత్రి కొడాలి నాని మీడియాతో మాట్లాడారు. గుడివాడలో జూదం, క్యాసినో జరిగాయని గజ్జి కుక్కలు, కుల కుక్కలు నిరూపించలేకపోతే చంద్రబాబు, ఆయన తొత్తులు ఏం చేస్తారని ప్రశ్నించారు. చంద్రబాబుకు టైం అయిపోయిందని, ఇటువంటి పనికిమాలిన కార్యక్రమాలే చేస్తుంటాడన్నారు. నిజ నిర్ధారణ కమిటీలో ఎప్పుడూ గెలవని వర్ల రామయ్య, ప్రజల చీత్కారానికి గురై, మహిళలను వేధించి విజయవాడలో ఓటమి పాలైన పనికిమాలిన వాళ్ళను వేశారన్నారు. ప్రశాంతంగా ఉండే గుడివాడలో రచ్చ చేయడానికి ప్రయత్నిస్తున్నాడన్నారు. చంద్రబాబుకు సిగ్గు, శరం లేదని చెప్పారు. పెడిగ్రీ తింటున్న కొంత మంది కుక్కలు రికార్డింగ్ డ్యాన్స్ లు జరిగాయని చూపిస్తున్నారన్నారు. మహిళలతో రికార్డింగ్ డ్యాన్స్ లు వేయిస్తున్నట్టుగా తనకు సమాచారం వస్తే వెంటనే గుడివాడ డీఎస్పీకి ఫోన్ చేసి తెలియజేశానన్నారు. అటువంటి కార్యక్రమాలు జరగకుండా ఆదేశాలు ఇవ్వడంతో డీఎస్పీ అక్కడకు వెళ్ళి ఐదారు గంటల్లోనే అక్కడి నుండి అందరినీ పంపించివేశారన్నారు. దీనికి క్యాసినో ఆడారంటూ తన ప్రతిష్ఠను దిగజార్చే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. చంద్రబాబు, ఆయన తండ్రి ఖర్జూరనాయుడు వచ్చినా గుడివాడలో తన చిటికెన వేలు మీద వెంట్రుక కూడా పీకలేరన్నారు. చంద్రబాబు పిచ్చి ప్రేలాపనలు మానుకోవాలని హెచ్చరించారు. చంద్రబాబు దగ్గర పెడిగ్రీ తింటున్న కుక్కలు మొరుగుతుంటాయని, వాటిని పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. కే. కన్వెన్షన్లో క్యాసినో నిర్వహించినట్టు నిరూపించాలని సవాల్ విసిరారు. గుడివాడలో ప్రజలు ఉన్నారని, మీడియా వెళ్ళి విచారణ జరపవచ్చని తెలిపారు. చంద్రబాబు పంపించిన వాళ్ళు వెళ్తే ప్రజల చేతుల్లో తన్నులు తిని వస్తారన్నారు. గుడివాడలో నిజ నిర్ధారణ కమిటీ సభ్యులను ఎవరూ అడ్డుకోలేదని, కే. కన్వెన్షన్ దగ్గరకు వెళ్తే కొట్టి పంపించేవారని అన్నారు. పోలీసులు ఉండబట్టి ఈ పనికిమాలిన సన్నాసులు బతికి వెనక్కి వచ్చారన్నారు. న్యూట్రల్ గా వ్యవహరించే మీడియా వెళ్ళవచ్చని చెప్పారు. క్యాసినో జరగలేదని తేలితే చంద్రబాబు, ఆయన కొడుకు లోకేష్ ఏం చేస్తారో ఈ చెత్తగాళ్ళు చెప్పాలన్నారు. అమ్మాయిలను అడ్డం పెట్టుకుని బతికే చరిత్ర తెలుగుదేశం పార్టీది అని అన్నారు. ఆనాడు లక్ష్మీపార్వతిని అడ్డం పెట్టుకుని ఎన్టీఆర్ కు ద్రోహం చేసి ఆయన పార్టీని, ముఖ్యమంత్రి పదవిని లాక్కున్న కుక్క చంద్రబాబు అని విమర్శించారు. అమ్మాయిని అడ్డం పెట్టుకుని సైకిల్ గుర్తు సంపాదించుకున్న బ్రోకర్ చంద్రబాబు అని అన్నారు. రాజకీయాల కోసం భార్యను రోడ్డెక్కించిన దుర్మార్గుడు చంద్రబాబు అని, ఆయన, పనికిమాలిన మీడియా చేసే విమర్శలను పట్టించుకోనని మంత్రి కొడాలి నాని స్పష్టం చేశారు.

# గుడివాడలో వైసీపీ శ్రేణులను, ప్రజలను అడ్డుకున్న పోలీసులు





గుడివాడ, ప్రజాపాలన జనవరి 21: గుడివాడ, జనవరి 21: తెలుగుదేశం పార్టీ నిజ నిర్ధారణ కమిటీ పర్యటన నేపథ్యంలో గుడివాడ నియోజకవర్గంలో శాంతి కోరుతూ నియోజకవర్గ ప్రజలు అన్ని వైపుల నుండి ర్యాలీలను నిర్వహించారు. మెయిన్ రోడ్డులోని టీడీపీ కార్యాలయానికి చేరుకున్న కమిటీ సభ్యులకు పెద్దఎత్తున నిరసన తెలిపారు. ఒక దశలో టీడీపీ కార్యాలయం వైపు దూసుకు రావడంతో పోలీసులు రెండు వైపులా బారిగేట్లను ఏర్పాటు చేసి అడ్డుకోవడం జరిగింది. మరోవైపు వైసీపీ శ్రేణులు కూడా అడ్డుకున్న పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. ప్రజల ఆగ్రహాన్ని దృష్టిలో పెట్టుకుని టీడీపీ నిజ నిర్ధారణ కమిటీ సభ్యులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. గుడివాడ పట్టణం లింగవరం రోడ్డులోని మంత్రి కొడాలి నానికి చెందిన కే. కన్వెన్షన్లో ఈ నెల 11 వ తేదీ నుండి 15 వ తేదీ వరకు జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్లబండ లాగుడు ప్రదర్శన పోటీలను నిర్వహించడం జరిగింది. రాష్ట్ర నలుమూలల నుండి దాదాపు లక్ష మందికి పైగా పశు పోషకులు, రైతులు, ప్రజలు విచ్చేసి ఈ ప్రదర్శన పోటీలను వీక్షించారు. అయితే ఇక్కడ క్యాసినో వంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగాయంటూ ఇటీవల టీడీపీ నాయకులు జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ మేరకు జిల్లా ఎస్పీ విచారణకు ఆదేశిస్తూ, నూజివీడు డీఎస్పీని విచారణ అధికారిగా నియమించడం జరిగింది. ఫిర్యాదు చేయడంతో పాటు టీడీపీ నిజ నిర్ధారణ కమిటీని నియమించింది. సభ్యులుగా నక్కా ఆనంద్ బాబు, వర్ల రామయ్య, కొల్లు రవీంద్ర, బొండా ఉమా, ఆలపాటి, తంగిరాల సౌమ్యలను నియమించింది. వీరు క్యాసినో నిర్వహించిన ప్రదేశాన్ని పరిశీలించి పూర్తిస్థాయి నివేదికను అధిష్టానానికి ఇచ్చేందుకు ఎన్టీఆర్ భవన్ నుండి బయటుదేరారు. టీడీపీ నిజ నిర్ధారణ కమిటీ పర్యటన నేపథ్యంలో వైసీపీ శ్రేణులు కే కన్వెన్షన్ కు భారీగా చేరుకున్నాయి. వైసీపీ శ్రేణులకు నియోజకవర్గ నలుమూలల నుండి స్వచ్ఛంధంగా వచ్చిన ప్రజలు మద్దతుగా నిలిచారు. వీరంతా కే. కన్వెన్షన్ నుండి ర్యాలీగా బయలుదేరి నాగవరప్పాడు సెంటర్ కు చేరుకున్నారు. అక్కడ పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో కొద్దిసేపు రోడ్డుపైనే బైఠాయించారు. బెజవాడ రౌడీలు గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. అక్కడి నుండి భారీ ర్యాలీగా మెయిన్ రోడ్డుకు చేరుకున్నారు. అదే రోడ్డులో ఒకవైపు టీడీపీ కార్యాలయం కూడా ఉంది. టీడీపీ నిజ నిర్ధారణ కమిటీ సభ్యులు టీడీపీ కార్యాలయానికి చేరుకున్నారన్న సమాచారంతో ఒక్కసారిగా అక్కడున్న వారంతా టీడీపీ కార్యాలయం వైపు పరుగులు పెట్టారు. పోలీసులు టీడీపీ కార్యాలయానికి రెండు వైపులా బారిగేట్లను ఏర్పాటు చేసి అడ్డుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కొద్దిసేపటికి పోలీసులు టీడీపీ నిజ నిర్ధారణ కమిటీ సభ్యులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. అక్కడి నుండి ప్రజలతో కలిసి వైసీపీ శ్రేణులు ర్యాలీగా వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కు చేరుకున్నాయి. తిరిగి అక్కడి నుండి మెయిన్ రోడ్డు వైపు బయలుదేరారు.

టీడీపీ కార్యాలయం మీదుగా వెళ్ళేందుకు పోలీసులు అనుమతించలేదు. దీంతో ఏలూర్ రోడ్డు మీదుగా వైసీపీ శ్రేణులు కే. కన్వెన్షన్ కు చేరుకున్నాయి. ఎట్టకేలకు టీడీపీ నిజ నిర్ధారణ కమిటీ సభ్యులను గుడివాడలో పర్యటించనీయకుండా ప్రజలు కూడా తిరగబడడంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రచించిన వ్యూహం ఫలించినట్టయింది.

## మంత్రి కొడాలి నానిపై చేస్తున్న కుట్ర రాజకీయాలను ప్రజల మద్దతుతో నిరశిస్తూ గుడివాడ నాగవరప్పాడు సెంటర్లో బైరాయించిన వైసీపీ శ్రేణులు



గుడివాడ, జనవరి 21: రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) పై తెలుగుదేశం పార్టీ కుట్ర రాజకీయాలకు పాల్పడుతోందని గుడివాడ మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ అడపా బాబ్జి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం గుడివాడ పట్టణం లింగవరం రోడ్డులోని కే. కన్వెన్షన్, మెయిన్ రోడ్డులో జరిగిన వేర్వేరు సమావేశాల్లో అడపా బాబ్జి మీడియాతో మాట్లాడారు. ఎంతో ప్రశాంతంగా ఉండే గుడివాడ నియోజకవర్గాన్ని అల్లకల్లోలం చేసేందుకు టీడీపీ శ్రేణులు ప్రయత్నించాయన్నారు. దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టం చేశారు. క్యాసినో వంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండానే జరిగినట్టుగా విషప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. గుడివాడ నియోజకవర్గ, పరిసర ప్రాంత ప్రజలంతా మంత్రి కొడాలి నాని ఆధ్వర్యంలో జరిగిన జాతీయస్థాయి ఎడ్ల బండలాగుడు ప్రదర్శన పోటీలను ప్రత్యక్షంగా వీక్షించారని చెప్పారు. ఈ నేపథ్యంలో క్యాసినో వంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగాయని చెబితే ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. పోలీసులకు ఒకవైపు ఫిర్యాదు చేయడంతో పాటు ఇంకో వైపు నిజ నిర్ధారణ కమిటీ పేరుతో గుడివాడలో అరాచకం సృష్టించేందుకు ప్రయత్నించారని, ప్రజలు తరిమికొట్టే పరిస్థితి టీడీపీకి ఎదురైందని చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు మండలి హనుమంతరావు మాట్లాడుతూ విజయవాడ నుండి కిరాయి గూండాలను తీసుకువచ్చి గుడివాడలో అలజడి సృష్టించేందుకు టీడీపీ ప్రయత్నించిందన్నారు. టీడీపీ శ్రేణుల్లో నైరాశ్యం నింపేందుకు కుట్ర రాజకీయాలు చేశారన్నారు. తెలుగుదేశం పార్టీలో మొదటి నుండి ఇటువంటి ఆనవాయితీ కొనసాగుతూ వస్తోందన్నారు. కిరాయి వ్యక్తులతో దెబ్బలు తిని వైసీపీ కార్యకర్తలు కొట్టినట్టుగా చిత్రీకరించే ప్రమాదం ఉందన్నారు. దీన్ని ప్రజల మద్దతుతో నిరశిస్తున్నామని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లో కుట్ర రాజకీయాలను అడ్డుకుని తీరతామన్నారు. గుడివాడ ప్రజలు ఎంతో చైతన్యంతో వ్యవహరిస్తారని గుర్తుచేశారు. పిచ్చి వేషాలు మానుకోవాలని టీడీపీ శ్రేణులను మండలి హెచ్చరించారు. వైసీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఎన్ని కుట్రలకు పాల్పడినా మంత్రి కొడాలి నాని ప్రతిష్ఠను అంగుళం కూడా తగ్గించలేరని చెప్పారు. ఇప్పటికైనా టీడీపీ శ్రేణులు పద్ధతి మార్చుకోకపోతే గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత దుక్కిపాటి శశిభూషణ్, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు పాలేటి చంటి, గుడివాడ ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి సంఘం చైర్మన్ ఎంవీ నారాయణరెడ్డి, ఎంపీపీ పెయ్యల ఆదాం, జడ్పీటీసీ సభ్యుడు గోళ్ళ రామకృష్ణ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రూరల్ మండల అధ్యక్షుడు మట్టా జాన్విక్టర్, నాయకులు మెరుగుమాల కాళీ, కసుకుర్తి బాబ్జి, పాలడుగు రాంప్రసాద్, మేకల సత్యనారాయణ, కొంకితల ఆంజనేయప్రసాద్, గిరిబాబాయ్, మూడెడ్ల ఉమా, చింతల భాస్కరరావు, వెంపటి సైమన్, దారం నరసింహా, కొలుసు నరేంద్ర, రేమల్లి పసి, షేక్ సయ్యద్, చుండి బాబి, పెద్ది కిషోర్ , పొట్లూరి మురళీధర్, తోట రాజేష్, లోయ రాజేష్, ఎస్కే బాజీ, అలీబేగ్, చింతాడ నాగూర్ , చిన్ని దుర్గాప్రసాద్, మాదాసు వెంకటలక్ష్మి, గంటా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది



పొన్నూరు జనవరి21 (ప్రజాపాలన ప్రతినిధి) : వరి ధాన్యాన్ని పండించిన ప్రతి రైతు వద్దనుండి ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని పొన్నూరు వ్యవసాయ సంచాలకులు సిహెచ్. తిరుమలదేవి అన్నారు. శుక్రవారం ఆమె మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి వెల్లలూరు గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పొన్నూరు మండలంలోని 22 రైతు భరోసా కేంద్రాలలో 607 కూపన్ లకు గాను 3430.68 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అలానే చేబ్రోలు మండలం లో 17 ఆర్ బి కె కేంద్రాల ద్వారా 540 కుపన్ లకు గాను 2812.4 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. మండలంలో ఈ ఏడాది 31500 ఎకరాలు సాగు చేయగా 8000 ఎకరాలు మెషిన్ తో కట్ చేయగా 23500 ఎకరాలు కుప్పలు వేశారన్నారు. గత నవంబర్లో కురిసిన అకాల వర్షాల వల్ల ధాన్యం కొంత తడిచి ఉండటంతో రైతులు బయట వ్యక్తులకు అమ్ముకోవటం జరిగిందన్నారు. అలాగే ఇటీవల కురిసిన వర్షాలకు మునిపల్లె, వెల్లలూరు, బ్రాహ్మణ కోడూరు, మంచాల గ్రామాలలోని ఆర్ బి కె కేంద్రాల ద్వారా 1000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన నాణ్యత ప్రమాణాలను బట్టి ప్రతి గింజలు రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయడం జరుగుతుందని రైతులు గమనించాలని ఆమె కోరారు. బయట దళారుల మాటలు నమ్మి రైతులు మోసపోవద్దని ఆమె సూచించారు. ఆమె వెంట తాసిల్దార్ డి. పద్మనాభుడు, సర్పంచ్ జాలాది యానాది రావు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పిచ్చిరెడ్డి, వ్యవసాయ అధికారి సత్యానందం ,సివిల్ సప్లై అధికారులు ఆర్ బి కె సిబ్బంది పాల్గొన్నారు.




## నేచురల్ స్టార్ నానికి దక్కిన మెగా గౌరవం



నేచురల్ స్టార్ నాని నటించిన ప్రతిష్టాత్మక చిత్రం శ్యామ్ సింగ రాయ్. రాహుల్ సంక్రీత్యన్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో హీరో నాని రెండు విభిన్నమైన పాత్రల్లో నటించిన ఆకట్టుకున్నారు. ఓ పాత్రలో ఫిల్మ్ మేకర్ వాసుదేవ్ గా మరో పాత్రలో శ్యామ్ సింగ రాయ్ గా నాని పలికించిన హావ భావాలు ప్రేక్షకులతో పాటు సినీ సెలబ్రిటీలనీ విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. డిసెంబర్ 24న తెలుగు తమిళ మలయాళ కన్నడ భాషల్లో ఏక కాలంలో విడుదలైన ఈ చిత్రం యునానిమస్ గా సూపర్ హిట్ టాక్ ని సొంతం చేసుకుంది. వసూళ్ల పరంగానూ నాని నటించిన గత చిత్రాలకు మించి భారీ వసూళ్లని రాబట్టి సంచలనం సృష్టించింది. ఇందులో నాని పోషించిన శ్యామ్ సింగ రాయ్ దేవదాసిగా రోజీ పాత్రలో నటించిన సాయి పల్లవి గురించి ప్రతీ ఒక్కరూ ప్రశంసలు కురిపిస్తున్నారు. కోల్ కతా నేపథ్యంలో టైమ్ ట్రావెల్ కథగా సరికొత్త కథగా రూపొందిన ఈ చిత్రం విడుదలై దాదాపు నెల రోజులు కావస్తున్నా ఈ మూవీ పై క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదు. తాజాగా ఈ మూవీని ఓటీటీ దిగ్గజం నెట్ ఫ్లిక్స్ లో ఈ శుక్రవారం విడుదల చేశారు. ఈ నేపథ్యంలో ఈ చిత్రంపై ప్రశంసలు కురిసిస్తున్న వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతూనే వుంది. ఇటీవల ఈ చిత్రం పై స్టార్ హీరో మెగా పవర్ స్టార్ ప్రశంసల వర్షం కురిపించారు. ఇప్పటి వరకు నాని సాయి పల్లవిల కెరీర్ బెస్ట్ పెర్ఫార్మెన్స్ ని ఈ మూవీలో ప్రదర్శించారని కొనియాడారు రామ్ చరణ్. అంతే కాకుండా ఇతర పాత్రల్లో నటించిన కృతిశెట్టితో పాటు లాయర్ గా కీలక పాత్రలో నటించిన మడోన్నా సెబాస్టియన్ ని కూడా అభినందించారు. తాజాగా ఈ జాబితాలో మెగాస్టార్ చిరంజీవి కూడా చేరారు. ఈ చిత్రాన్ని ప్రత్యేకంగా తిలకించిన మెగాస్టార్ చిరంజీవి దంపతులు హీరో నేచురల్ స్టార్ నానిని తమ ఇంటికి ఆహ్వానించి ఆతిథ్యాన్నిచ్చి ప్రత్యేకంగా అభినందించడం విశేషం. ఈ మధ్య కాలంలో మెగాస్టార్ ఫ్యామిలీ ఓ హీరోని ఇంటికి పిలిచి ఆతిథ్యాన్నిచ్చి మరీ అభినందించడం ఇదే ప్రప్రధమం కావడంతో నేచురల్ స్టార్ కి మెగా ఫ్యామిలీ దంపతుల అభినందలన రూపంలో అరుదైన గౌరవం దక్కిందని ఇండస్ట్రీలో చెప్పుకుంటున్నారు. మెగాస్టార్ ఆహ్వానం మేరకు ఆయన ఇంటికి వెళ్లిన నేచురల్ స్టార్ నాని ప్రత్యేకంగా మెగా దంపతులు మెగాస్టార్ చిరంజీవి ఆయన సతీమణి సురేఖ తో కలిసి తన సినిమా సంగతుల్ని పంచుకున్నారు. దీనికి సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం నెట్టింట సందడి చేస్తోంది.

## ఆస్కార్స్ లిస్ట్ లోకి సూర్య “జై భీమ్”



సూర్య ప్రధాన పాత్రలో టి. జే. జ్ఞానవేల్ దర్శకత్వం లో తెరకెక్కిన చిత్రం జై భీమ్. ఈ చిత్రం డైరెక్ట్ డిజిటల్ గా అమెజాన్ ప్రైమ్ వీడియో లో విడుదల అయ్యి సెన్సేషన్ క్రియేట్ చేస్తుంది. సినీ పరిశ్రమ కి చెందిన పలువురు ప్రముఖుల నుండి, విమర్శకుల నుండి ప్రశంసలు దక్కించుకున్న ఈ చిత్రం ఇప్పటికే ఆస్కార్స్ లిస్ట్ లో చేరడం జరిగింది. గతేడాది సూర్య హీరోగా నటించిన సూరారై పొట్రు చిత్రం కూడా ఆస్కార్స్ లిస్ట్ లో చేరిన సంగతి అందరికి తెలిసిందే. సూర్య వరుస చిత్రాలు ఆస్కార్స్ కి ఎంపిక అవ్వడం పట్ల అభిమానులు ప్రేక్షకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మొత్తం 276 చిత్రాలు 94 వ అకాడమీ అవార్డు నామినేషన్ లో ఉన్నాయి. 2 డి ఎంటర్ టైన్మెంట్ పతాకం పై జ్యోతిక, సూర్య లు సంయుక్తంగా నిర్మించడం జరిగింది.

## మాది జన్మజన్మల కలయిక.. ఆ దేవుడే మమ్మల్ని కలిపాడు



‘సింహా’ ‘లెజెండ్’ తర్వాత నటసింహం నందమూరి బాలకృష్ణ – దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్ లో తెరకెక్కిన హ్యాట్రిక్ మూవీ “అఖండ”. డిసెంబర్ 2న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళు రాబట్టింది. ఈ సినిమా విజయవంతంగా 50 రోజులు పూర్తి చేసుకోవడంతో అభిమానుల కేరింతలు ఆనందోత్సావాల మధ్య అఖండ చిత్రం అర్ధ శతదినోత్సవ వేడుక జరిగింది. గురువారం నాడు సాయంత్రం హైదరాబాద్ లోని ఆర్.టి.సి. క్రాస్ రోడ్ లో గల సుదర్శన్ 35.ఎం.ఎం. థియేటర్ ఇందుకు వేదికైంది. ప్రేక్షకులతో కలిసి బాలయ్య – బోయపాటి శ్రీను – నిర్మాత మిర్యాల రవీందర్ రెడ్డి ‘అఖండ’ చిత్రాన్ని చూశారు. ఈ సందర్భంగా నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ.. “ఆర్.టి.సి. క్రాస్ రోడ్ కు వస్తుంటే మా రామకృష్ణ స్టూడియో జ్ఞాపకాలు గుర్తుకు వస్తున్నాయన్నారు. స్టూడియోలో నాన్నగారి కోసం టిఫిన్ తీసుకు వచ్చేవాడినంటూ అప్పటి రోజులను ప్రేక్షకులకు తెలియజేశారు. మరోవైపు ‘సమరసింహారెడ్డి’ శతదినోత్స వేడుకకు వచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. ‘అఖండ’ చిత్ర విజయాన్ని గురించి ప్రస్తావిస్తూ.. ఇది ప్రేక్షకులు ఇచ్చిన విజయం. మా టీమ్ సమిష్టి కృషి అని అన్నారు.“శివుడు భక్తుడిగా నేను చేసిన అఖండలోని పాత్ర నాన్నగారు చేసిన పాత్రలు గుర్తు చేసుంటూ వాటిని పోషించాను. మొన్ననే సంక్రాంతి పండుగ జరుపుకున్నాం. ఇప్పుడు అఖండ పండుగ ఇది. కోవిడ్ సమయంలో థియేటర్లకు ప్రేక్షకులు వస్తారోరారో అనుకున్న సమయంలో తీర్థయాత్రలకు వచ్చినట్లు థియేటర్లకు జనాలు వచ్చారు. ఇది ఆంధ్ర తెలంగాణే కాదు కర్నాటక మహారాష్ట్ర ఒరిస్సా.. అలాగే యావత్ ప్రపంచ పండుగ అఖండ అర్థ శతదినోత్సవం. ఈ వేడుకను పలుచోట్ల అభిమానులు జరుపుకుంటున్నారు. అందుకు గర్వంగా వుంది”“ఈ సినిమా విజయాన్ని చేసేలా సహకరించిన ఆది దంపతులకు కృతజ్ఞతలు. ఇక బోయపాటి శ్రీను నా కాంబినేషన్ హాట్రిక్. మా కలయిక జన్మజన్మలది. అందుకే ఆ దేవుడే మమ్మల్ని కలిపాడు. మానవ పుట్టుకలో ఒకరో ఇద్దరినో స్నేహితులుగా ఇస్తారు. కానీ మాకు కోట్లాది మంది అభిమానులను సంపాదించేలా భగవంతుడు చేశాడు. నేను ఏది చేసినా అభిమానులు ప్రోత్సహిస్తూనే వున్నారు. నాకు నాన్నగారు ఆదర్శం. ఈ అఖండ విజయం తెలుగు చలన చిత్ర పరిశ్రమ విజయం”“ఈ సినిమాలో తీసుకున్న అంశం హిందూ సమాజం ధర్మం పద్ధతులు. వాటిజోలికి ఎవరైనా వస్తే దేవుడు అఖండలా వచ్చి వారికి బుద్ధి చెబుతాడు. కలుషితమైపోయిన సమాజానికి ప్రక్షాళనగా ఈ సినిమా వుంది. ఇంత అద్భుతమైన విజయానికి కారకులు అభిమానులు ప్రేక్షకులే. ఇది పాన్ ఇండియా సినిమా కాదు. పాన్ వరల్డ్ సినిమా. ఇక తమన్ సంగీతం ఈ చిత్రానికి అదరగొట్టేలా చేసింది. రిలీజ్ కాకముందు ఈ సినిమా గురించి గొప్పగా చెప్పుకున్నారు. రిలీజ్ అయ్యాక థమన్ సంగీతంలా అదిరింది అన్నారు”“తెలుగు పరిశ్రమ ఇలాగే మూడు పువ్వులు ఆరుకాయలుగా వుండాలి. అఖండ సినిమాను థియేటర్లలో చూసి ఎంతో పెద్ద ఘనవిజయాన్ని సాధించారు. అదే విధంగా రేపు సాయంత్రం 6గంటల నుంచి డిస్నీ ప్లస్ హార్ట్ స్టార్ లో కూడా చూసి ఎంజాయ్ చేయండి” అని బాలయ్య తెలిపారు. అనంతరం ‘అఖండ’ 50 రోజుల జ్ఞాపికలను ఎగ్జిబిటర్లకు పంపిణీదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నైజాం పంపిణీదారుడు శిరీష్ రెడ్డి – సుదర్శన్ థియేటర్ అధినేత బాల గోవిందరాజు – మేనేజర్ బాలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు బోయపాటి శ్రీను మాట్లాడుతూ.. “ఆ పరమేశ్వరుని ఆశీస్సులతో అలాగే అభిమానుల అండతో తెలుగు ప్రేక్షకుల అండదండలతో బాలయ్య బాబు నా మీద పెట్టుకున్న నమ్మకంతో ఈ సినిమాకు సహకరించిన నిర్మాతలకూ అఖండ విజయం సాధించి పెట్టింది. దాదాపు వందకుపైగా థియేటర్లలో ఆడుతోంది. మంచి సినిమా తీస్తే ప్రేక్షకులు ఆదరిస్తారని నిరూపించారు. ఈ విజయం నందమూరి అభిమానులది. తెలుగు ప్రేక్షకులది. తెలుగు పరిశ్రమది. ఈ విజయాన్ని ఎన్.టి.ఆర్.గారికి అంకితమిస్తూ మా కాంబినేషన్ ఎప్పుడు తీసినా మీ ఆదరాభిమానాలు వుండాలని కోరుకుంటున్నాను” అని అన్నారు. నిర్మాత మిర్యాల రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. “నందమూరి కుటుంబానికి ప్రేక్షకులకు నమస్కారాలు. మీ అభిమానాన్ని యాభైరోజులు ఏకధాటిగా చూపించారు. అందుకే కృతజ్ఞతలు తెలిపేందుకు మీ ముందుకు వచ్చాం. మనం ఏదైనా కల కంటే అది నిజమైతే ఆనందంగా వుంటుంది. నిజాయితీగా చెబుతున్నా.. ఇలా అఖండ సినిమా విడుదల అవుతుందనీ.. యాభై రోజులు ఆడుతుందనీ.. ఇంకా థియేటర్లలో కొనసాగుతుందని కానీ నేను కానీ ఎవరూ కానీ కల కనలేదు. ఆ కలను నిజంచేసిన ప్రతి ఒక్కరినీ ధన్యవాదాలు తెలుపుకుంటున్నా. ముందుముందు ఇలాగే మీ అభిమానం ఉండాలి. జై బాలయ్య” అని ముగించారు.

## ‘ఆచార్య’ ప్లేస్ లో ‘బింబిసార’ ఫిక్స్ అయినట్టే!




కల్యాణ్ రామ్ హీరోగానే కాదు .. నిర్మాతగా కూడా కొన్ని సార్లు సాహసాలు చేస్తుంటాడు. అలాంటి సినిమాల జాబితాలోనే ‘బింబిసార’ను చేర్చుకోవచ్చు. 40 కోట్ల బడ్జెట్ తో ఆయన నిర్మించిన సినిమా ఇది. ఈ సినిమాకి మల్లిడి వశిష్ట్ దర్శకుడిగా వ్యవహరించాడు. సోషియో ఫాంటసీ జోనర్లో నడిచే కథ ఇది. ఈ సినిమాలో ఒక బంచ్ లో కల్యాణ్ రామ్ ‘బింబిసార’గా కనిపించనున్నాడు. ఆయన నుంచి వచ్చిన ఫస్టులుక్ అందరిలో ఆసక్తిని రేకెత్తించింది. అలాగే పెద్దగా అనుభవం లేని దర్శకుడి చేతుల్లో ఆయన ఇంత పెద్ద ప్రాజెక్టును ఉంచడం ఆశ్చర్యపరిచింది. ఇక ఈ సినిమాను మొదలు పెడుతున్నట్టుగా .. షూటింగు నడుస్తున్నట్టుగా కల్యాణ్ రామ్ ఎక్కడా చెప్పలేదు. అందువలన అప్ డేట్స్ రాలేదు. చాలా వరకూ సినిమా పూర్తయిన తరువాత పోస్టర్స్ పట్టుకునే ఆయన ఎంట్రీ ఇచ్చాడు. దాంతో ఒక్కసారిగా అందరూ షాక్ అయ్యారు. ఇంత పెద్ద ప్రాజెక్టు ఎప్పుడు మొదలుపెట్టారు? ఎలా పూర్తి చేశారు? అనేది హాట్ టాపిక్ గా మారిపోయింది. ఈ సినిమాలో కేథరిన్ .. సంయుక్త మీనన్ కథానాయికలుగా అలరించనున్నారు. తెలుగులో సంయుక్త మీనన్ చేసిన మొదటి సినిమా ఇదే. ప్రస్తుతం ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. ఈ సినిమా క్రిస్మస్ బరిలో దిగనున్నట్టుగా వార్తలు వచ్చాయి. కానీ అప్పటికి ఇంకా పనులు పూర్తి కాకపోవడం వలన అలాంటి ప్రయత్నాలేవీ జరగలేదు. ఇక ఇప్పుడు ఈ సినిమాను ఇబ్రవరి 4వ తేదీన విడుదల చేయాలనే ఆలోచనలో ఉన్నారట. ఆ దిశగానే పనులు జరుగుతున్నాయని అంటున్నారు. నిజానికి ఈ తేదీన చిరంజీవి – కొరటాల ‘ఆచార్య’ రావలసింది. కానీ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం వలన ఏప్రిల్ 1వ తేదీకి ఈ సినిమాను వాయిదా వేశారు. ఇక ఆ రోజున ప్లాన్ చేసిన ‘సర్కారువారి పాట’ కూడా దాదాపు వాయిదా పడినట్టే. ‘బింబిసార’ను కూడా రెండు భాగాలుగా విడుదల చేయనున్నట్టు తెలుస్తోంది. ఒక భాగాన్ని ఫిబ్రవరి 4వ తేదీన విడుదల చేయనున్నారన్నమాట. మొదటి భాగం విడుదలైన తరువాతనే సెకండ్ పార్టును మొదలు పెడతారని అంటున్నారు. కల్యాణ్ రామ్ తన కెరియర్ లోనే తొలిసారిగా చారిత్రక నేపథ్యం కలిగిన కథను టచ్ చేస్తున్నాడు. డిఫరెంట్ లుక్ తో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. ఇక భారీ బడ్జెట్ తో ఈ సినిమాను నిర్మించాడు. అంతా కూడా కల్యాణ్ రామ్ ఇంత బరువును భుజాన కెత్తుకోవడం అంత తేలికైన విషయమేం కాదు అనే అంటున్నారు. మరి ఆయన ప్రయోగాన్ని ప్రేక్షకులు ఎంతవరకూ సక్సెస్ చేస్తారనేది చూడాలి.

## ఓటీటీ గూటికే అక్కినేని హీరో సినిమా!

అక్కినేని ఫ్యామిలీ నుంచి నాగార్జున తరువాత వచ్చిన హీరో సుమంత్. ఫిజిక్ పరంగా .. యాక్టింగ్ పరంగా సుమంత్ కి వంకబెట్టవలసిన అవసరం లేదు. అయితే ఎందుకో ఆయనకి పెద్దగా హిట్లు పడలేదు. ‘సత్యం’ .. ‘గోదావరి’ వంటి సినిమాలు తప్ప ఆయన కెరియర్లో చెప్పుకోదగిన సినిమాలు కనిపించవు. ఇక సుమంత్ కూడా వరుస సినిమాలు చేయాలనే ఆలోచనలో ఉన్నట్టుగా అనిపించదు. చకచకా సినిమాలు చేయాలనే ఆత్రుత ఆయనలో కనబడదు. అక్కినేని ఫ్యామిలీలోని మిగతా హీరోల సినిమాల్లోను కనిపించడానికి పెద్దగా ఆసక్తిని చూపనట్టు తెలిసిపోతూనే ఉంటుంది. ఈ సినిమా మీరు చేయాలి అని చెప్పేసి వెళితే చేస్తాడు .. లేదంటే లేదు. ఇక ఇతర సినిమాల సినిమాల ఫంక్షన్స్ లో ఆయన కనిపించడు. అలాగే తన సినిమాలను గురించి కూడా ఎక్కడా ఎక్కువగా మాట్లాడడు. సైలెంట్ గా ఆయన తన పని తాను చేసుకుపోతుంటాడు అంతే. ఈ మధ్య కాలంలో కూడా ఆయనకి హిట్ ఇచ్చిన సినిమాలేవీ లైన్ మీద కనిపించవు. కొంతకాలం క్రితం ఆయన ‘మళ్లీ మొదలైంది’ అనే ఒక సినిమా చేశాడు. రాజశేఖర్ రెడ్డి నిర్మించిన ఈ సినిమాకి టీజీ కీర్తి కుమార్ దర్శకత్వం వహించాడు. అనూప్ రూబెన్స్ సంగీతాన్ని అందించిన ఈ సినిమా సరైన విడుదల తేదీ కోసం వెయిట్ చేస్తుందేమోనని అనుకున్నారు. కానీ ప్రస్తుతం పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం వలన ఈ సినిమా డైరెక్ట్ గా ఓటీటీ ఫ్లాట్ ఫామ్ పైకి వచ్చేస్తోంది. జీ 5 వారు ఈ సినిమా స్ట్రీనింగ్ హక్కులను సొంతం చేసుకున్నారు. వచ్చేనెలలో ఈ సినిమాను స్ట్రీమింగ్ కి రెడీ చేస్తున్నారు. విడాకులు తీసుకున్న కథానాయకుడు .. ఆ కేసును వాదించే న్యాయవాదితో ప్రేమలో పడితే ఎలా ఉంటుందనేదే ఈ సినిమా కథ. ఈ సినిమాలో సుమంత్ సరసన నాయికలుగా నైనా గంగూలీ .. వర్షిణి సౌందరరాజన్ కనిపించనున్నారు. ఒక కీలకమైన పాత్రలో సుహాసిని నటించగా ఇతర ముఖ్యమైన పాత్రల్లో పోసాని పృథ్వీ .. మంజుల ఘట్టమనేని .. వెన్నెల కిశోర్ కనిపించనున్నారు. మరి ఓటీటీ ఫ్లాట్ ఫామ్ పై ఈ సినిమా ఎలాంటి రిజల్టును రాబడుతుందో చూడాలి.




"మీరు గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని విశ్వసిస్తే,
మీరు స్వయం సహాయాన్ని నమ్ముతారు, ఇది ఉత్తమ సహాయం"
—డా. బి.ఆర్ అంబేద్కర్

BUSINESS v/s SOCIAL ENGINEERING

20 సంవత్సరాల స్నేహ గ్రూప్ ప్రయాణం
వ్యాపారమా...? లేక సోషల్ ఇంజనీరింగా...?
మీరే చెప్పండి

BUSSINESS
వ్యాపారం ద్వారా వచ్చే లాభాన్ని పార్ట్నర్స్ గాని డైరెక్టర్ గాని పంచుకోవడాటాన్ని వ్యాపారం (Bussiness) అంటారు

SOCIAL ENGINEERING
సంస్థ నిర్వహించే కార్యకలాపాల ద్వార వచ్చే లాభం మొత్తాన్ని సొసైటీ మార్పు కోసం,పేదల అభివృద్ధి కొరకు,విద్య కొరకు,ఆరోగ్యం కొరకు వాడటాన్ని సోషల్ ఇంజనీరింగ్ అంటారు.

స్నేహ చిట్స్ లో కంపెనీకి వచ్చే లాభాల్ని చారిటీకి వాడుతూ మెంబర్స్‌కు వచ్చే లాభాలను మెంబర్స్‌కు ఇవ్వటం జరుగుతోంది

అంబేద్కర్ టీవీ నిర్మాణం కొరకు స్నేహ మ్యాక్స్ లో డిపాజిట్ చేసిన వారందరికీ వారికి ఇవ్వాల్సిన ఇంట్రెస్ట్ (Interest)ని ఇచ్చి ఆ డిపాజిట్ ని మెంబర్స్‌కి అప్పులు ఇచ్చి,రికవర్ చేసిన తర్వాత వచ్చే లాభాల మొత్తాన్ని అంబేద్కర్ టీవీ ఛానల్‌ను నడపటానికి వినియోగిస్తున్నాం

అంబేద్కర్ టీవీ ఛానల్
సామాజిక దృక్పథంతో బహుజన సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, తద్వారా పరిష్కారమార్గంలోకి తీసుకెళ్లడానికి ప్రయత్నం చేస్తుంది

మహిళలు సాధించిన పురోగతి స్థాయి ద్వారా నేను సమాజ పురోగతిని కొలుస్తాను.
—డా. బి.ఆర్ అంబేద్కర్

జై పూలే జై భీమ్ జై బహుజన జై భారత్

Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printing at : Unyted Publications, From H.no: #5+-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com